

వైద్యో నారాయణో హరి అన్నది ఒకప్పటి నానుడి.. ఎందుకంటే అప్పటిలో వైద్యుడు దేవుడిలా ఉండేవాడు.. వైద్యమూ అలాగే చేసేవాడు.. నాడి పట్టుకుని రోగం ఏంటో చెప్పేవాడు.. రోగిని చూసి వైద్యం చేసేవాడు.. మరిప్పుడో అంతా మారిపోయింది.. రోగి చెప్పింది వినాలంటే (కన్సల్టెన్సీ) రూ.500 నుంచి రూ.1000.. మరీ డిమాండ్ ఉంటే రూ.2 వేలు.. ఒకసారి చేయి పట్టుకుంటే (ఐసీయూ) రూ.10 వేలు..ఆ తరువాత టెస్ట్‌లు.. మందులు షరా మామూలే.. రోగి నుంచి ఇష్టానుసారం పిండేస్తున్నారు.. ఎమర్జన్సీ ఆసుపత్రుల్లో అయితే మరీనూ.. లక్షల ఉంటేనే వైద్యం.. లేదంటే దైన్యమే.. ప్రైవేటు వైద్యంపై ప్రభుత్వ నియంత్రణ కొరవడడంతో రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారు.. కేవలం జ్వరం అని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళితే రూ.5 వేలు అవుతుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఇక హార్ట్ స్ట్రోక్ అని వెళ్లారా.. రోగి బంధువులు చచ్చారే...!దీంతో ఆసుపత్రికి వెళ్లాలంటనే భయపడే రోజులు వచ్చాయి..



డబ్బు..జబ్బు!

చూస్తే రూ.వెయ్యి.. పట్టుకుంటే రూ.10 వేలు

ఓ పెద్దావిడ మెట్లపై జారి పడడంతో తలకు దెబ్బ తగిలింది. ఆమెను రాజమహేంద్రవరంలోని ఓ ప్రముఖ కార్పొ'రేటు' ఆస్పత్రికి తీసుకెళితే ముందుగా రూ.5లక్షలు లాగేశారు. ఎడాపెడా టెస్టులు చేసి మెదడులో రక్తస్రావమైందని గుర్తించారు. మరో రూ.20 లక్షలు కడితే బ్రెయిన్ సర్జరీ చేసేస్తామన్నారు. డిశ్చార్జి చేస్తే చనిపోతుందని ఆ వైద్య వ్యాపారులు భయపెట్టారు. ఆ సర్జరీకి అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో బెంగళూరు నిమ్‌హాన్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఏదోలా అక్కడి నుంచి బయటపడి నిమ్‌హాన్స్‌కి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో 20 రోజుల వైద్యానికి అన్నీ కలుపుకొని రూ.2 లక్షలు మాత్రమే అయ్యింది. ఆమె క్షేమంగా ఇంటికి చేరారు.

కడుపు బిగపట్టేసిందని, త్రేన్పు రావడం లేనది ఓ పెద్దాయనను నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అంతే.. స్ట్రెచర్‌పై ఎక్కించి గదిలోకి తీసుకెళ్లి బంధువులకు ఠాగూర్ సినిమా చూపించారు. ఎండోస్కోపీ, యాంజియోగ్రామ్, స్కానింగ్.. ఇలా రకరకాల పరీక్షలు చేశారు. చివరికి సంచినిండా మందులు రాసి రూ.లక్ష బిల్లు వేశారు. తీరా ఆయనకు గ్యాస్ పెయిన్ వచ్చిందని రూ.5 ట్యాబ్లెట్ లేదా రూ.50 ఇంజక్షన్‌తో నయం అయిపోయేదని తర్వాత ఓ వైద్యుడు చెప్పడంతో పెద్దాయనతో పాటు బంధువులు అవాక్కయ్యారు. అన్నీ ఇలాంటివే కాకపోయినా నూటికి తొంభై శాతం ఇలానే జరు గుతోందనే వాదనలో వాస్తవం లేకపోలేదు.

- ప్రైవేటు ఆసుపత్రుల్లో బాదుడే
- డిమాండ్‌ను బట్టే కన్సల్టెన్సీ
- రూ.500 నుంచి ఆపైమాటే
- ఏడు రోజులే కార్డు
- మధ్యలో వెళితే మళ్లీ చార్జ్
- ఐసీయూ రూ.10 వేలు
- జ్వరం అని వెళ్లినా పరీక్షే..
- ఆసుపత్రికి వెళితే కష్టమే
- అచ్చంగా ఠాగూర్ సినిమా
- భయపడుతున్న ప్రజానీకం
- తట్టుకోలేక ఆత్మహత్యలు
- ఇష్టానుసారం రేట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'వైద్యో నారాయణో హరి' అంటే వైద్యులు సాక్షాత్తూ దైవంతో సమానం అని అర్థం. మన సమాజంలో వైద్యుడికిచ్చే గౌరవం అది.. కానీ ఇవాళ ప్రైవేటు/కార్పొరేటు ఆస్పత్రులకు వెళితే కుబేరుడు కూడా బికారి అయిపోతున్నాడు. వైద్యుల మితిమీరిన కాసుల కక్కుర్తికి రోగుల బంధువులు బలైపోతున్నారు. వైద్యం మరీ ఖరీదైపోవడంతో రోగి కుటుంబం ఆర్థికంగా కుదేలవు తోంది.ఏదేమైనా.. వైద్య రంగానికి డబ్బు జబ్బు ముదిరి..విలువలు మరీ తిగజారుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' పరిశోధనాత్మక కథనం.

చూస్తే రూ.500

చూస్తే వెయ్యి..పట్టుకుంటే 5 వేలు అనేంతగా వైద్యుల తీరు మారింది. వైద్యుల వద్దకు వెళ్లి చూపించుకోవాలంటే కన్సల్టెన్సీ కార్డు ధర తక్కువలో తక్కువంటే రూ.500 నుంచి ఆరంభం.రూ.2 వేలు ఉండే కార్డులూ ఉన్నాయి.అయితే వీటి జీవిత కాలం మాత్రం 7 నుంచి 15 రోజులే. గతంలో అయితే సుమారు నెల రోజులు ఉండేది. ఆ మధ్యలో ఎప్పుడు వెళ్లినా చూసేవారు.ఇప్పుడు మధ్యలో వెళ్లినా రూ.100 చెల్లించుకోవాలి. మందులు మాత్రం నెలకు రాసేస్తారు.అంటే నెల తర్వాత వస్తే మళ్లీ కార్డుకు డబ్బులు సమర్పించుకోవాలి. అసలు నాడి పట్టుకోకుండా రోగి లోనికి వచ్చిన సమస్య ఏమిటని అడగడం మరుక్షణం నుంచే మందులు రాసేస్తారు..ఈ కన్సల్టెన్సీ(కార్డు) ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో రోగిని పిండేస్తున్నారు. ప్రస్తుత తరం వైద్యులను చూసి ఆ తరం వైద్యులు మారిపోయారు. డబ్బే పరమావధిగా వైద్యం



ఆసుపత్రికెళితే జేబు ఖాళీ..

ఇవాళ వైద్య రంగంలో కాసుల కక్కుర్తి తప్ప మానవతా దృక్పథం, నైతిక విలువలు కొరవ డడంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. రోగి వ్యాధిని డబ్బుతో తూకం వేయడం మితి మీరిపోయింది. డాక్టర్లు టార్గెట్లు రీచ్ కావడానికి అవసరం లేకపోయినా ఎక్స్‌రే, స్కానింగ్, మందులు రాసేస్తున్నారు. ఆస్పత్రులకు పట్టుకొన్న మరో జాడ్యం మందులు (మెడిసిన్). సొంతగా ఆస్పత్రుల్లోనే మెడికల్ షాపులు ఉండడంతో ప్రిస్క్రిప్షన్ నిండిపోయే వరకూ మందులు రాసేస్తున్నారు.దీని వెనుక ఆశ్చర్యపోయే మాయ దాగి ఉంది.గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటేటివ్స్‌నినియమించుకొని వాళ్లను డాక్టరు వద్దకు పంపించి ప్రొడక్టును ప్రచారం చేసుకోవడం జరిగేది. దీనిని ఎథికల్ మార్కెటింగ్ అనే వాళ్లు.ఆ ప్రొడక్టును ఎక్కువగా రాసినందుకు తాయిలాలుగా వచ్చేవి. ఈ పద్ధతి ఇప్పటికీ ఉన్నా బాగా తగ్గింది. ఇప్పుడు కొత్త ఒరవడి వచ్చింది. హరియాణ, గుజరాత్‌లోని పలు చోట్ల మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. ఆయా కంపెనీల నుంచి పెద్ద ఎత్తున మందులు తెచ్చి విక్రయిస్తున్నారు.ఇవి వైద్యులకు చాలా తక్కువ ధరకు వస్తాయి. వీటిని ఎక్కువ ధరకు విక్రయిస్తారు.అందుకే అవసరం ఉన్నా లేకపోయినా ఎక్కువ మందులు రాస్తుంటారు. గ్యాస్ట్రిక్ లేకపోయినా గ్యాస్ ట్యాబ్లెట్ రాసేయడం ఈ మధ్య చూస్తూనే ఉన్నాం. వైరల్ ఫీవర్‌కి యాంటి బయోటిక్ రాయకూడదు.అసలు యాంటి బయోటిక్స్ తక్కువగా సూచించాలని ఆ తరం వైద్య నిపుణులు నెత్తీ నోరు బాదుకుంటున్నారు. అయినా తమ మెడికల్ షాపుల వ్యాపారం కోసం వైరల్ ఫీవర్‌కి సెఫిక్షిమో ఒఫలాక్సిన్ వంటి యాంటి బయోటిక్స్ చీటిలో నింపేస్తున్నారు. కాసుల కక్కుర్తితో రాసే మందులు వ్యాధి నయం మాట అటుంచితే కొత్త రోగా లు చుట్టు ముడుతున్నాయి. చివరికి రోగి ఒళ్లు, ఇల్లు గుల్లవుతోంది. తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడేవారెందరో..

చేస్తున్నారు.దీంతో రోగులు.. వారి కూడా వచ్చే బంధువులు లబోదిబోమంటున్నారు.

జనం మారాలి..

జనం కూడా మారాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. తక్కువ ధరతో చేసే వైద్యం.. తక్కువ మందులు రాసే వైద్యుడు రోగికి నచ్చడం లేదు. ఆస్పత్రికి వెళ్లిన వెంటనే హడావుడి సృష్టించి ప్రిస్క్రిప్షన్ నిండా మందులు రాస్తే సంతృప్తి పడుతున్నారు. ఇదో మాయరోగంలా దాపురించింది. పారాసిటమల్ వేసుకుంటే తగ్గిపోయే జ్వరానికి వంద రకాల మందులు రాస్తే గానీ కుదుట పడడం లేదు. చిన్న పిల్లాడికి విరేచనాలు అవుతుంటే ముద్దపప్పు పెట్టండని, తిండి తినడం లేదంటే ఇష్టమైనవి వండి పెట్టాలని చెబుతుంటే తమను తింగరోళ్ల మాదిరిగా చూసే జనం కూడా ఉన్నారని ఓ వైద్యుడు వాపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అలాగే ఏ టెస్టులూ లేకుండా మందుల రాస్తే.. ఏ టెస్టులూ చేయకుండా జబ్బు నయం చేయడంపై మీకు ఎలా అవగాహన వచ్చిందని ప్రశ్నించి..అవసరం లేదన్నా ఇన్ పెషెంటుగా జాయినైపోతామని తమపైనే ఒత్తిడి చేసే రోగులూ ఉన్నారని మరో వైద్యురాలు ఆశ్చ ర్యం వ్యక్తం చేశారు.ఈ ఉదాహరణలు మనలో వైద్యం పట్ల రావాల్సిన మార్పును సూచిస్తు న్నాయి.

కమీషన్ వ్యాపారం..

అధిక శాతం ఆస్పత్రులు కమీషన్లతో లాభాలు గడిస్తున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీ ఆయా ఆస్పత్రుల్లో ఎన్‌రోల్ చేయించుకొని పేషెంటును రిఫర్ చేస్తే కొంత మొత్తం లేదా 40 శాతం వరకూ కమీషన్ ముట్టజెబుతున్నారు. అందుకే ఈ మధ్య నగరాల్లోని ప్రైవేటు/కార్పొరేటు ఆస్పత్రుల్లో గ్రామీణ రోగులు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇక స్కానింగ్, ఎక్స్‌రే తదితర టెస్టులకు తమ వద్దకు పంపిస్తే లేబోరేటరీలు ఆయా ఆస్పత్రులకు 50 శాతం వరకూ కమీషన్ రూపంలో ఇస్తున్నాయి. ఫలానా ల్యాబ్‌కి మాత్రమే వెళ్లాలని ఆస్పత్రుల్లో సూచించడం, వేరే దగ్గర చేయించుకొంటే తిరస్కరించడం, స్పష్టంగా ఫలితాలు రాలేదని చెప్పడం దాదాపుగా అందరికీ అనుభవమే.దీనికి ఆ కమీషన్ కక్కుర్తే కారణం. ఓ వ్యక్తి లిపిడ్ ప్రొఫైల్ పరీక్షకు ఓ ల్యాబ్‌కి వెళ్లారు. రూ.1200 అవుతుందని వాళ్లు చెప్పారు. ఆ వ్యక్తి డాక్టరు ఫోన్ చేసి వారికి ఇచ్చారు. తాను వేరే ఊరి డాక్టరునని, తనకు కమీషన్ వద్దని చెప్పడంతో రూ.600 మాత్రమే ల్యాబ్ వారు బిల్లు వేశారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. 'వైద్యో నారాయణో హరి' అనే నానుడు ఎందుకు కన్నీరు పెడుతోందో చెప్పడానికి ఈ ఉదాహరణలు మచ్చు తునకలు మాత్రమే సుమా!.. రోజూ ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతూనే ఉన్నాయి.



నకిలీ రేషన్ కార్డులు 4430

- ఉమ్మడి జిల్లాలో నకిలీలపై సర్వే
- రెండు రాష్ట్రాల్లో కార్డులపై ఆరా
- ఒక రాష్ట్రంలో తొలగింపు
- కేంద్ర గణాంకాలతో పరిశీలన

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):తెల్లరేషన్‌కార్డుల్లో నకిలీలను ఏరివేయనున్నారు.ఏపీతో పాటు వేరే రాష్ట్రంలోను రేషన్‌కార్డు పొంది అక్కడా.. ఇక్కడా కూడా లబ్ధిపొందుతున్న కొందరిపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్దఎత్తున డూప్లికేట్ రేషన్ కార్డులు ఉన్నట్టు తెలుస్తోంది. కేంద్రం గణాంకాల ఆధారంగా సర్వే చేయ నున్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4430 డూప్లికేట్ తెలుపు రేషన్ కార్డులు ఉన్నట్టు నేషనల్ లెవెల్ డీ డూప్లికేట్ ఆఫ్ రేషన్‌కార్డు డేటా బేస్ ఆధారంగా గుర్తించారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిస్సా రేషన్ కార్డుల్లో సభ్యులుగా ఉన్నట్టు గుర్తించారు. వన్ నేషన్-వన్ రేషన్ కార్డు పేరిట నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా ఇది బయట పడింది.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు.డేటాను అనుసరించి రీసర్వే చేసి రెండు రాష్ట్రాల్లో కార్డులున్న వారి వివరాలను పంపాలని సూచించారు. దీనిపైఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో వీఆర్వోలు సర్వే చేయను న్నారు.

డూప్లికేట్లతో పక్కదారి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి కాకినాడ జిల్లాలో 319, కోనసీమ 324, తూర్పుగోదావరి జిల్లాలో 269, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3518 డూప్లికేట్ రేషన్ కార్డులు ఉన్నట్టు కేంద్రం పంపిన నివేదికలో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రీసర్వే చేసి ఆయా రేషన్‌కార్డుల్లో సభ్యులు ఇతర రాష్ట్రాల్లో ఉన్న రేషన్‌కార్డుల సభ్యులు ఒక్కరేనని ధ్రువీకరించిన తర్వాత రేషన్‌కార్డుల నుంచి కుటుంబ సభ్యులను తొలగిస్తారు. పేదలకు అందాల్సిన ఉచిత బియ్యం పథకం పక్కదారిన పడుతుందని పెద్ద ఎత్తున కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లడంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. ఒకే వ్యక్తిగానీ, ఒకే కుటుంబంగానీ రెండు రాష్ట్రాల్లో రేషన్ తీసుకోవడంవల్ల ప్రభుత్వానికి పెద్దఎత్తున నష్టం జరుగుతుందని గుర్తించింది.ఈ విషయమై జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి ఎంపీ ప్రసాద్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

డీఆర్వోగా సీతారామమూర్తి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా విశాఖపట్నం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న టీ.సీతారామమూర్తిని ప్రభుత్వం నియమించింది.ప్రస్తుత డీఆర్వో జి.నరసింహులును తిరుపతి డీఆర్వోగా నియమించారు. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

కౌలు రైతులకు రైతు సాగు కార్డులు
కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పంటలు పండించే రైతులకు సాగు హక్కు కార్డును అందజేయడమే లక్ష్యమని కలెక్టర్ ప్రశాంతి అన్నా రు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో సాగుదారుల హక్కు చట్టం అమలుపై కౌలు రైతులు, భూయజమానులు,వ్యవసాయశాఖ, బ్యాం కర్లతో సమావేశం నిర్వహించారు. గత ంలో రూపొందించిన కౌలుదారుల చట్టాల్లో లోపాలను అధిగమించి నూరుశాతం కొత్త చట్టాలను అమలు ప్రయోజనం చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.భూయజమాని పట్టాదారుల హక్కులకు భంగం కలగకుండా ప్రత్యక్ష, పరోక్ష అనుమతితో కార్డును జారీ చేస్తారన్నారు.గతంలో తహశీల్దార్ రెవెన్యూ విభాగం ద్వారా గుర్తింపు ఇచ్చేవారని నూతన చట్టంలో వ్యవసాయశాఖ అధికారులు కౌలు కార్డులు ఇస్తారన్నారు.

'వ్యవసాయ విస్తరణాధికార్ల హేతుబద్ధీకరణ తగదు'

రాజమహేంద్రవరం,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో)ను హేతుబద్ధీకరణ పేరుతో స్థాయిని తగ్గించడానికి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల చర్యలను తాము వ్యతిరేకిస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు తెలిపారు.ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరం వచ్చిన వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించినట్టు చెప్పారు.



భూచోళ్లు.. ఎక్కడ!

భాస్కర్‌నగర్‌లో వివాదాస్పద స్థలం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- భాస్కర్‌నగర్ డొంక కదులుతోంది
- లేఅవుట్ అక్రమాలపై కలెక్టర్ ఆరా
- ఆరుగురు సభ్యులతో కమిటీ
- ఆక్రమణకు గురైన స్థలాల పరిశీలన
- భూమాఫియా కథనానికి స్పందన

భూమాఫియాల డొంక కదులుతోంది. దశాబ్దా లుగా సాగుతున్న భాస్కర్ నగర్ భూ మాఫియాకు చెక్ పెట్టడానికి జిల్లా యంత్రాంగం కదిలింది. ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో భూచోళ్లు శీర్షికతో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పందించారు. అప్పట్లోనే రిజిస్ట్రేషన్లు ఆపేయాలని ఆదేశించారు. జిల్లా సహకార అధికారి నుంచి నివేదిక తెప్పించుకుని అధ్యయనం చేసి వివిధ విభాగాల ముఖ్య అధికారులతో సిక్స్ మెన్ కమిటీని నియమించారు. నెల రోజుల్లోఈ లేఅవుట్ సంగతి తేల్చాలనే లక్ష్యంతో యంత్రాం గం ముందుకు సాగుతోంది. రాజమహేంద్రవరం సిటీఆర్ఐ ప్రాంతం భాస్కరనగర్‌లో 1928లో ప్రభుత్వ ఉద్యోగులు కొందరు ది.రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్స్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.1967లో సొసైటీ ప్రెసిడెంట్‌గా ఉన్న సుంకర భాస్కరరావు (కోఆపరేటివ్ ఆఫీసర్) ఆధ్వర్యంలో భూస్వామి ఆలపాటి భాస్కర రామయ్య అండ్ బ్రదర్స్ నుంచి రూ.10 వేలకు సుమారు 32 ఎకరాల భూమిని సొసైటీ కోసం కొనుగోలు చేశారు. 1968లో ప్రభుత్వం మార్కెట్ విలువ (సబ్ రిజిస్టర్ వేల్యూ) ప్రకారం 32.09 ఎకరాలు సొసైటీ పేర రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ భూమి సర్వే నంబర్లు 111, 114,117, 118,119, 120, 121/1, 122/1, 135గా ఉన్నాయి. 1975లో భూమిని 254 ప్లాట్లుగా కేటాయించారు.మరో 20 క్రాస్ బిట్లు ఉన్నాయి. వీటిలో కొన్ని ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరగలేదు. మరికొన్ని భూయజమానులు ఎవరో తెలియదు.దీంతో ఖాళీ స్థలాలపై భూమాఫియా కన్నుపడింది. రూ.కోట్ల విలువైన ఇక్కడ భూములన్నీ రాజకీయనేతల అండదండలతోనే కబ్జా అయినట్టు చెబుతున్నారు.భూ యజమానులు స్థాని కంగా లేకపోవడం.. రిజిస్ట్రేషన్లు కాకపోవడం తదితర కారణాలతో ఆక్రమించుకోవడం..వేరేవారికి అమ్మే యడం ఇలా చాలా ప్లాట్లు ఇప్పటికి మూడు నాలుగు చేతులు కూడా మారాయి. ఇక్కడ గజం స్థలం రూ.35 వేల నుంచి రూ.45వేల వరకూ ఉంది. మార్కెట్ విలువ ఉంటే, మొత్తం ఒక్కో ప్లాట్ 346 గజాల కంటే ఎక్కువగా ఉంది. 420 గజాల స్థలాలు కూడా ఉన్నాయి. ఇది పెద్ద వివాదం కావడంతో గతంలో విజిలెన్స్ విచారణ జరిపి నివేదిక ఇచ్చింది. సొసైటీ సభ్యులు ఎవరూ లేకపోవడంతో సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్థాయి అధికారిని ప్రభుత్వం ఇక్కడ లిక్విడేటర్‌గా నియమించింది.కానీ పరిస్థితిలో మార్పులేదు.అన్యాక్రాంతం జరుగుతూనే ఉంది. మొత్తం 254 ప్లాట్లలో 160 సక్రమంగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.42 ప్లాట్లు అన్యాక్రాంతమైనట్టు గుర్తించారు. మిగతా 78 ప్లాట్లను పరిశీలిస్తున్నారు.



భూములపై ఆర్‌డీవో కృష్ణనాయక్ ఇతర అధికారుల పరిశీలన

రికార్డులు మాయం

ఈ సొసైటీ భూములకు సంబంధించిన రికార్డులను ఎవరో మాయం చేశారు. సబ్- రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్లు చివికిపోయి ఉన్నట్టు చెబుతున్నారు. అయినా సుమారు 10 ప్లాట్లకు పైగా సబ్- రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయడం గమనార్హం. ఇక్కడ భూకబ్జాదారులు, అధికారులు కుమ్మక్కయ్యే రికార్డులు మాయం చేశారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కోర్టులో ఆరు ప్లాట్లు ఒకరికే రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతంపై హియరింగ్ జరుగుతోంది. ఇటీవల సర్వే నంబర్ 121/1లోని 249,250 నంబరు ప్లాట్లకు సంబంధించి తాజాగా మరో వివాదం చెలరేగింది.

కలెక్టర్ ఆరా! కమిటీ ఏర్పాటు

'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆరా తీసి ఆరుగురు సభ్యులతో హైలెవెల్ కమిటీని నియమించారు. కమిటీలో రాజమహేంద్రవరం ఆర్‌డీవో కృష్ణనాయక్,జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీరాములు నాయుడు,జిల్లా రిజిస్ట్రార్ (ఆర్.సత్యనారాయణ), సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు, మునిసిపల్ కార్పొరేషన్ చీఫ్ ప్లానర్ కోటయ్య, అర్బన్ తహశీల్దార్ పాపారావు ఉన్నారు. హైలెవల్ కమిటీ గురువారం వివాదాస్పద స్థలాలను పరిశీలించింది. మొత్తం సుమారు 2 గంటల పాటు ఈ ప్రాంతమంతా కలియతిరిగి, ప్రజల నుంచి వివరాలు సేకరించింది.లిక్విడేటర్ చంద్రశేఖర్ ఇక్కడ పరిస్థితిని అధికారులకు స్వయంగా వివరించారు. ఆర్‌డీవో కృష్ణనాయక్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు స్థలాలను పరిశీలించామన్నారు. ఇక్కడ ఎవరికి ఎన్‌వోసీలు ఇచ్చారో, ఎవరు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారో తదితర వివరాలను లిక్విడేటర్ నుంచి సేకరిస్తామని చెప్పారు. సుమారు నెల రోజుల్లో సమస్యను అధ్యయనం చేసి, ఎవరికీ చెందని, అన్యాక్రాంతమైన స్థలాలను స్వాధీనం చేసుకుంటామన్నారు.స్థానిక ప్రజలు, బాధితుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు.



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఆటలు ఓటమిని భరించే శక్తినిస్తాయి
పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆటలు ఓటమిని భరించే శక్తిని.. కష్టాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాయని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ క్రీడలు, క్రీడల పోటీలు-2024ను క్రీడల పతాకాన్ని ఎగురవేసి ప్రారంభించారు. పోలీసుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి పోలీస్ స్పోర్ట్స్ మీట్ దోహదపడుతుందన్నారు.నిరంతరం విధి నిర్వహణలో ఉండే పోలీసు లకు క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ చూ పిన వారు రాష్ట్ర పోలీస్ మీట్‌లో పాల్గొంటారన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మీట్‌లో 7 జోన్లకు చెందిన 7 టీమ్‌లు కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, 100, 400, 800 మీటర్ల పరుగు, హైజంప్, లాంగ్ జంప్, క్రికెట్, టెన్నీస్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు.

సీనరేజి, జీఎస్‌టీ రద్దుపై ఉత్తర్వులు రావాలి

రాజమహేంద్రవరం సిటీ/ కొవ్వూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు రీచ్‌ల నుంచి కనీసం వెయ్యి మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకం చేసేలా బోట్స్ మెన్ సొసైటీలకు లక్ష్యాలను నిర్దేశించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం జిల్లాస్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 118 సొసైటీలకు అనుమతులివ్వడం జరిగిందన్నారు. 17 ఓపెన్ రీచ్‌లకు డీఎల్ఎస్సీ అనుమతులు జారీ చేశామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఇసుక సీనరేజి, జీఎస్టీ రద్దుపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందని జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి జి.ఫణీంద్రరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 డీసిల్టేషన్ ర్యాంపులు అనుమతించడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలో 3, కొవ్వూరు డివిజన్‌లో 6 ర్యాంపులు నడుస్తున్నాయన్నారు. రాజమహేంద్రవరంలో ఒక ర్యాంపును విశాఖపట్నం జిల్లా వినియోగదారులకు కేటాయించామన్నారు. ఇసుక రవాణా సమయంలో టోల్ చార్జీలు వినియోగదారులు చెల్లించాలన్నారు. జిల్లా టాస్క్‌పోర్సు టీము ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



అస్సా 'గోబ్యాక్'

అస్సాగో పరిశ్రమను తొలగించాలని నాలుగు గ్రామాల ప్రజలు పట్టుబట్టారు.. ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. దీనిపై స్పందించి కలెక్టర్ కమిటీ వేశారు. - 7లో

ప్రేమను ఒప్పుకోలేదని.. వివాహితపై హత్యాయత్నం 7

ఇక రుడా వెంచర్లు 6



మధుమేహం ఉన్నా.. 'మధురంగా'

మార్కెట్‌లో ఆకర్షిస్తున్న డయాబెటిక్ స్వీట్స్
తీపి తిన్నామనే ఫీల్ పొందొచ్చు
అందులో పంచదార కంటే.. తక్కువ చక్కెరనిచ్చే పదార్థాలు
ఇవి ఆలస్యంగా అరగడం వల్ల తక్కువ షుగర్ లెవెల్స్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తీపి అంటే ఎవరికి చేదు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనాసరే స్వీట్ అంటే ఇష్టమే. ముఖ్యంగా గోదావరి జిల్లాల ప్రజల జీవన శైలిలో తీపి ఓ భాగం. శుభకార్యక్రమం గురించి చెప్పేటప్పుడు, అభినందించేటప్పుడ నోటిని తీపి దనం చేస్తారు. బంధువులు, మిత్రుల ఇళ్లకు వెళ్లేటప్పుడు కూడా చాలామంది స్వీట్స్ తీసుకుని వెళ్తారు. ఫంక్షన్ల భోజనాల్లో స్వీట్లు లేకుండా వడ్డన ఉండదు. పండుగలకు స్వీట్ తప్పనిసరిగా ఉంటుంది. చివరకు పరామర్శలకు వెళ్లేటప్పుడూ పంచదారో, స్వీటో వంటి తీపి పదార్థాలను తీసుకువెళ్తారు. అంటే షడ్‌రుచుల్లో తీపి ఒకటి. ప్రధానమైనది కూడా. కానీ మధుమేహ (చక్కెర.. డయాబెటీస్) వ్యాధితో బాధపడుతున్న వారికి స్వీట్ ఓ ప్రమాదకర పదార్థమైపోయింది. స్వీట్ తినడంవల్ల షుగర్ లెవల్స్ పెరిగి ప్రాణాంతక పరిస్థితులు కూడా ఏర్పడతాయి. వైద్యులు కూడా స్వీట్లు తినవద్దని హెచ్చరిస్తారు. పంచదార ఉండే ఏ పదార్థాలు, దుంపలు వంటి కూరలు కూడా కట్టడి చేస్తారు. కానీ రుచికి అలవాటు పడిన నాలుకను ఆపడం కష్టమే. స్వీట్ తినే అదృష్టం కూడా లేదని గతంలో వారంతా తెగ బాధపడిపోయేవారు. ఒక్కొక్కరు ఉండలేక ఓ స్వీట్ తినేయడం.. టాబ్లెట్ వేసుకోవడం కూడా చేస్తున్నారు. కానీ కొంతకాలంగా డయాబెటీస్ బాధితుల నోటిని తీపిచేస్తూ వారికి షుగర్ లెవల్స్ పెరగకుండా చేస్తూ ఉండే స్వీట్లు కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. దీంతో చాలా మంది మనస్సు కుదుటపడింది. మార్కెట్‌లో డయాబెటీస్ స్వీట్లు పేరిట షుగర్‌ఫ్రీ స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు కూడా మార్కెట్‌లో ఉన్నాయి. స్వీట్లలో డయాబెటిక్ కాజా, సున్నుండలు, కోవా, కాజూబర్ఫీ, మోతీచూర్ లడ్డూ వంటివి అందుబాటులో ఉన్నాయి. కానీ ఇవి పూర్తిగా స్వీట్‌లెస్ స్వీట్లు కావు. ఈ పదార్థాల్లో పంచదారశాతం తక్కువ. ఆలస్యంగా అరుగుతాయి. అందువల్ల తిన్న వెంటనే ప్రభావం చూపవు. ఆలస్యంగా కొద్ది ప్రభావం మాత్రమే చూపుతాయి.

ఇవి ఎలా తయారు చేస్తారంటే..

ఈ స్వీట్లలో పంచదార వినియోగించరు. మార్కెట్‌లో లభ్యమయ్యే టాటాఫోసెన్స్, స్వీట్ మేకర్, హాఫ్ షుగర్ వంటి మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే పదార్థాలతో తయారుచేస్తారు. ఇది కొంత వరకూ డయాబెటిక్ బాధితుల నోటిని తీపి చేసుకోవచ్చు. టాటాఫోసెన్స్ లిక్విడ్ రూపంలో ఉంటుంది. దీంతో గులాబ్‌జామ్, కాజాలు వంటివి తయారు చేస్తారు. పంచదారలో 100శాతం పంచదార ఉంటే, బియ్యంలో 70శాతం వరకే ఉంటుంది. టాటాఫోసెన్స్‌లో 18శాతం మాత్రమే ఉంటుంది. అందువల్లే దీంతో తయారు చేసే స్వీట్లకు మార్కెట్ పెరిగింది.

ప్రత్యామ్నాయం.. డైట్ షుగర్

మార్కెట్‌లో పంచదారకు ప్రత్యామ్నాయంగా డైట్ షుగర్ వచ్చింది. ఇది పంచదారలాగే ఉంటుంది. గరుకుతనం కాస్త తక్కువ. స్వీట్‌నెస్ ఎక్కువ. దీంతో కోవా, క్యాజూబర్ఫీ వంటివి తయారు చేసుకోవచ్చు. కాఫీ, టీలలో వాడొచ్చు. మార్కెట్‌లో రెలిష్, నేచురా, గ్రీన్, షుగర్ లైట్ వంటి పేర్లతో వీటిని విక్రయిస్తున్నారు.

ఆఫ్ షుగర్

ఇది కూడా పంచదారలాగే ఉంటుంది. పంచదారలో ఉండే కాలరీస్‌లో సగమే ఉంటాయి. పంచదారలాగే తియ్యగా ఉంటుంది.

జలాటో

జలాటో అనేది ఐస్‌క్రీమ్‌లా ఉంటుంది. దీన్ని ఇటాలియం డిజట్ అంటారు. కానీ ఇది ఐస్‌క్రీమ్‌లా గట్టిపడదు. స్పూన్‌తోనే తినవచ్చు.

● నెమ్మదిగా అరుగుతాయి..



వాస్తవానికి డయాబెటీస్ స్వీట్ల కంటే మామూలు స్వీట్లే తీయగా ఉంటాయి. డయాబెటిక్ స్వీట్లలో చక్కెర శాతం తక్కువ ఉంటుంది. అసలు ఉండకుండా లేదు. కానీ డయాబెటీస్ స్వీట్లు నెమ్మదిగా అరుగుతాయి. పంచదారలా వెంటనే శరీరంలో కలిసిపోవు. అందువల్లే మధుమేహ బాధితులు వీటిని తిన్నా, పెద్దగా షుగర్‌లెవ్స్ పెరగవు.

-పోలిశెట్టి మల్లిబాబు, సురుచి అధినేత

కత్తి కట్టి.. ఆరేళ్లు!

నేటికీ తేలని కోడి కత్తి కేసు.. కేసు తేలకుండానే శ్రీనివాసరావుకు ఐదేళ్లు జైలు శిక్ష



కోడి కత్తి కేసు సంఘటన జరిగి గురువారం నాటికి ఆరేళ్లు పూర్తయ్యింది. అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌పై విశాఖ విమానాశ్రమంలో కోడికత్తితో శ్రీను దాడిచేశాడన్నది అభియోగం. ఈ కేసులో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి కోర్టుకు హాజరై తన వాదన చెప్పక పోవడంతో ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. జగన్ తరపు న్యాయవాదులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడంతో కేసు కోర్టులో వాయిదా పడుతూనే వస్తోంది. ప్రస్తుతం జగన్మోహనరెడ్డి సాధారణ ఎమ్మెల్యే అయినా కోర్టులో విచారణకు హాజరు కాకపోవడానికి ఏమిటి ఇబ్బందని నిందితుడు తరుపు న్యాయవాది సలీం, కుటుంబసభ్యులు, దళిత సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. మంత్రిగా ఉన్న నారా లోకేశ్ పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరవుతున్నారు కదా? ఆయనకు లేని ఇబ్బంది జగన్‌కే ఏంటని వారు పేర్కొంటున్నారు.

ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆ రోజు 2018, అక్టోబరు 25వతేదీ. విశాఖపట్నం విమానాశ్రయంలో నాటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహనరెడ్డిపై కోడికత్తి దాడి జరిగింది. జగన్ వీరాభిమాని అయిన ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటకు చెందిన జనిపల్లి శ్రీనివాసరావు విశాఖపట్నం విమానాశ్రయంలో చెఫ్‌గా పనిచేసేవాడు. ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్న జగన్ హైదరాబాద్ కోర్టుకు వెళ్లేందుకు విశాఖ విమానాశ్రయంలో వీఐపీ లాంజ్‌లో కూర్చున్న సమయంలో శ్రీనివాసరావు మీ అభిమానిని అం టూ ఆయన దగ్గరకు వెళ్లి మాటలు కలిపి కోడి కత్తితో దాడి చేయగా జగన్ వ్యక్తిగత భద్రత సిబ్బంది, సీఐఎస్ఎఫ్ అధికారులు అప్రమత్తమై శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడి సమయంలో జగన్‌కు ఎడమ భుజంపై చిన్న గాయమైంది. దీనిపై జగన్ అప్పుడు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చెయ్యలేదు. అక్కడ ప్రథమ చికిత్స చేయించుకుని హైదరా బాదులో మెరుగైన వైద్యం చేయించుకుంటానని వెళ్లిపోయారు. ఆ తర్వాత శ్రీనివాసరావు నా గొంతు కొయ్యబోయాడని జగన్ ఆరోపించగా జగన్‌పై హత్యాయత్నం చేసిందని శ్రీనివాసరావు అని చేయించింది క్యాంటీన్ ఓనర్ హర్షవర్ధన్ అని, హర్షవర్ధన్ టీడీపీ నాయకుడేనంటూ వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం, ధర్నాలు చేపట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదుచేశారు. విశాఖపట్నం సిట్ (ప్రత్యేక దర్యాప్తు సంస్థ) దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాత ఎన్ఐఏ(జాతీయ దర్యాప్తు సంస్థ) కూడా మరో కేసు నమోదు చేసింది. కేసు విచారణ తర్వాత 2019, మే 25న శ్రీనివాసరావుకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2019, ఆగస్టు 13న ఎన్ఐఏ అధికారులు విచారణ కోసం శ్రీనివాసరావు బెయిల్ రద్దు చేశారు. న్యాయం చేయాలని శ్రీనివాసరావు కుటుంబసభ్యులు అప్పటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ ఎన్‌వీ రమణకు ఒక లేఖ రాశారు. వాస్తవ పరిస్థితులు తెలపడానికి వీరు జగన్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. 2022, సెప్టెంబరు 26న శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు జగన్‌ను కలవడానికి అనుమతి ఇచ్చి తరువాత నిరాకరించారు. ఈ క్రమంలో 2023 నవంబరు 28న ఎన్ఐఏ కోడి కత్తి దాడిలో కుట్రకోణం లేదని హైకోర్టుకు నివేదించింది. శ్రీనివాసరావు తప్ప ఇతర వ్యక్తుల పాత్రకానీ, రాజకీయ పార్టీల ప్రమేయంకానీ లేదని ఎన్ఐఏ తేల్చి చెప్పింది. 2023, ఆగస్టు 1న ఈ కేసు విజయవాడనుంచి విశాఖ ఎన్ఐఏ కోర్టుకు బదిలీ అయ్యింది. జను పల్లి శ్రీనివాసరావు తల్లి సావిత్రి, సోదరుడు సుబ్బరాజు శ్రీనివాసరావు బెయిల్‌కు జగన్ కోర్టుకు హాజరై తన సాక్ష్యం చెప్పాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో వారు నిరహారదీక్ష చేపట్టగా శ్రీనివాసరావు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో నిరహారదీక్ష చేపట్టారు. వారి దీక్షను పోలీసులు భగ్నం చేసి బలవంతంగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై దళిత సంఘాలు ఆందోళన చేపట్టారు. శ్రీనివాసరావు విషయంలో జైలు అధికారులు తీరు అనుమానాస్పదంగా ఉందని విశాఖ దళిత సంఘం ఐక్యవేదిక ఆందోళన వ్యక్తం చేసింది. దళిత సంఘాలు, మైనార్టీ హక్కుల సంక్షేమ సంఘం, సమత సైనికదళ్, న్యాయవాది సలీం పోరాట ఫలితంగా 2024 ఫిబ్రవరి 9న శ్రీనివాసరావుకు కోర్టు కండిషన్ బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టి వెళ్లాలనే నిబంధన విధించారు. ఐదేళ్ల 14రోజులు శ్రీనివాసరావు కోర్టు శిక్ష విధించకుండానే జైలు జీవితం అనుభవించాడు. కేసు మాత్రం నేటికీ తేలలేదు.

జైల్లో ఉన్నత చదువులు

ఇక శ్రీనివాసరావు జైల్లో ఉండగా బీఏ డిగ్రీ, ఎంఏ సోషాయాలజీ పూర్తిచేశాడు. తనకు జరిగిన అన్యాయంపై సమాజంలో మంచి కోసం పోరాటం చేసేందుకు తాను సోషియాలజీ చదివినట్లు శ్రీనివాసరావు పేర్కొంటున్నాడు. వారం రోజుల్లో శ్రీనివాసరావు అతడి కుటుంబసభ్యులు ముఖ్యమంత్రిని కలిసి పరిస్థితిని వివరించేందుకు సమాయత్తం అవుతున్నట్టు సమాచారం. ఐదేళ్లుగా ఆర్థికంగా, సామాజికంగా తాము పడుతున్న ఇబ్బందిని వివరించనున్నారు. ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయడం ఎంతో ఇబ్బందిగా ఉందని, తనకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని సామాజిక న్యాయంపై శ్రీనివాసరావు ఒక పుస్తకం రాస్తున్నట్టు తెలిసింది.



స్వగ్రామం ఠాణేలంక పెదపేటలో కుటుంబ సభ్యులు న్యాయవాదితో శ్రీనివాసరావు (ఫైల్‌ఫొటో)





వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న వేద పండితులు. పక్క చిత్రంలో తిరుప్పావడ సేవ జరుపుతున్న దృశ్యం



సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

వైభవంగా తిరుప్పావడ సేవ

వాడపల్లిలో నాల్గో రోజు ఘనంగా బ్రహ్మోత్సవాలు
యోగ నారసింహ అలంకరణలో శ్రీవారి సింహ వాహనసేవ
ఆకట్టుకున్న పలు సాంస్కృతిక ప్రదర్శనలు

ఆత్రేయపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాల్గవ రోజు గురువారం కూడా ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించిన వసంత మండపంలో కొలువుతీరి పూజలు అందుకున్నారు. ఖండవల్లి రాజేశ్వర ప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు క్రతువు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యహ వచనము, అష్టకలశారాధన, ప్రధాన హోమాలు, దిగ్దేవ బలిహరణ తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపారు. స్వామి వారి అంతరాలయంలో తిరుప్పావడ సేవా కాలం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా జరిపారు. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, బలిహరణ తదితర కార్యక్రమాలు వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. స్వామివారి క్షేత్రం ఫలపుష్ప విద్యుత్ కాంతులతో చూపరులను ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కనకదుర్గాదేవి దంపతుల చేతుల మీదుగా బ్రహ్మోత్సవ పూజలు జరిపారు. అనంతరం యోగ నార సింహ అలంకరణలో శ్రీవారు సింహ వాహనంలో కొలువదీరారు. బాణసంచా కాల్పులు, భక్తుల గోవింద నామస్మరణ, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య తిరుమాడవీధుల్లో సింహ వాహనసేవ జరిపారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న ఉపకమిషనరు చక్రధరరావు దంపతులు

వాడపల్లిలో నేడు..

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం గోదావరి నదీ జలా సంగ్రహణము, మహాలక్ష్మి హోమము, మలయప్ప అలంకరణతో స్వామివారి గరుడ వాహనసేవ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభ

● హాజరుకానున్న ప్రముఖులు ● 13మందికి ప్రతిభా పురస్కారాలు

యానాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): యానాం కేంద్రంగా వెలువడుతున్న కవి సంధ్య, కవిత్వ పత్రిక స్థాపించి 50 సంచికలు పూర్తి చేసుకున్న సందర్భంగా 27న యానాంలో కవిసంధ్య స్వర్ణోత్సవ సభను నిర్వహిస్తున్నట్టు కవిసంధ్య సంపాదకుడు కళారత్న డాక్టర్ శిఖామణి, పురస్కార కమిటీ అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజులు తెలిపారు. యానాం గీతా భవన్‌లో ఆదివారం ఉదయం 9.30 గంటలకు సభ జరగనుంది. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాల ప్రదానం, శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ, కవి సమ్మేళన కార్యక్రమాలు జరగనున్నాయి. కవి సంధ్య సంపాదకుడు కళారత్న శిఖామణి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ దీర్ఘాశి విజయ్‌భాస్కర్, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ వీరలక్ష్మీదేవి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్, డాక్టర్ ఆర్.సీ తారం తదితరులు హాజరుకానున్నారు. కవి సంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే... ఈ సందర్భంగా 13 మంది (వచన, అభ్యుదయ, పత్రికా, లఘు కవిత, దళిత సాహిత్యం తదితర)కి ముఖ్య అతిథుల నుంచి కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరిలో కొమ్మవరపు విల్సన్‌రావు, కపిల రాంకుమార్, పోనుగుమట్ల విష్ణుమూర్తి, ఎన్.ఈశ్వరరెడ్డి, కాళ్ళకూరి శైలజ, జీవీ రత్నాకర్, మార్ని జానకిరామచౌదరి, మోకా రత్నరాజు, సరికొండ నరసింహరాజు, కోలాటి పెద్దిరాజు, కొండూరి రమరాజు, ఎస్వీ రామశాస్త్రి ఉన్నారు.

అన్నవరం వచ్చిన ఉద్యోగులకు పోస్టింగ్‌లు

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇతర దేవస్థానాల నుంచి అన్నవరం దేవస్థానానికి వచ్చిన ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇస్తూ గురువారం ఈవో రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీపై తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్‌లు వచ్చారు. మరో 9 మందికి వేరే విభాగానికి మార్చినట్టు అధికారులు తెలిపారు.

హుండీల ఆదాయం రూ.16.12 లక్షలు

సామర్లకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో 225 రోజులకు హుండీల ద్వారా రూ.16 లక్షల 139తో పాటు, విదేశీ కరెన్సీ రూ.12,492 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు గురువారం తెలిపారు. దేవదాయ తనిఖీ అధికారి ఫణి కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఉండూరుకు చెందిన లక్ష్మీ నారాయణ సేవా సంఘం భక్తులు ఉదయం నుంచీ హుండీలు లెక్కించారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

వీసీల నియామకంలో.. ఎందుకీ ఆలస్యం?



● ఇన్‌ఛార్జి వీసీల పాలనలోనే విశ్వవిద్యాలయాలు
● వర్సిటీలకు వీసీల నియామక సన్నాహాల్లో కూటమి ప్రభుత్వం
● నేటిలోగా సెర్చ్ కమిటీ సభ్యుడి పేరు ప్రతిపాదించాలి

జేఎన్టీయూకే, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో వీసీల నియామకంలో జాప్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖలో మార్పులు, సంస్కరణలు దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు రాజీనామా చేయాలని అనధికారికంగా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాష్ట్రంలోని 17 వర్సిటీల వీసీలు రాజీనామా చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ జేఎన్టీయూకే వీసీ, రాజానగరంలోని అక్నా వీసీలు కూడా రాజీనామా చేశారు. ప్రస్తుతం జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీగా ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, నన్నయ విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీగా ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, జేఎన్టీయూకే మరో ప్రొఫెసర్ కృష్ణా విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీగా కొనసాగుతున్నారు.

వీసీ పదవికి 20 దరఖాస్తు

రెగ్యులర్ ఉపకులపతుల నియామకం కోసం జేఎన్టీయూకే నుంచి 20మందికిపైగా రాష్ట్ర ఉన్నత విద్యామండలికి దరఖాస్తు చేసినట్లు సమాచారం. దరఖాస్తు చేసిన వారందరూ వీసీ పదవి కోసం రాజకీయంగా, సామాజికవర్గపరంగా పలుకుబడి ఉన్నవారితో పైరవీలు చేస్తున్నారు. మంత్రి నారాలోకేశ్‌తో సన్నిహిత సంబంధాలున్న జిల్లాకు చెందిన రాజకీయ నాయకుల ద్వారా తమ బయోడేటాలను ఆయనకు పంపిస్తున్నారు.

సెర్చ్‌కమిటీలో ముగ్గురు సభ్యులు

విశ్వవిద్యాలయాల సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును శుక్రవారం లోపు ప్రతిపాదించాలని ఏపీఎస్సీహెచ్‌ఈ నుంచి వర్సిటీలకు ఆదేశాలు వచ్చాయి. విశ్వవిద్యాలయాల పాలకమండలి సమావేశంలో సభ్యుడి పేరును తీర్మానించాలి. ఈసీ సూచించే సెర్చ్ కమిటీ సభ్యుడు విశ్వవిద్యాలయంలో ఆచార్యుడు కాకుండా ఉండాలి. ఇతర వర్సిటీల ఆచార్యులను పాలక మండలి సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమించాలి. ఉపకులపతుల ఎంపికకు సెర్చ్‌కమిటీ సూచనలు చేస్తుంది. దీనిలో ముగ్గురు సభ్యులుంటారు. యూజీసీనుంచి ఒకరు, ప్రభుత్వం నుంచి ఒకరు, వర్సిటీ నుంచి మరొకరిని పాలక మండలి ప్రతిపాదిస్తుంది. వీసీ పదవి కోసం ప్రొఫెసర్లు చేసిన దరఖాస్తులను సెర్చ్ కమిటీ పరిశీలిస్తుంది. వారి అనుభవం, పరిశోధనలు వంటి అంశాలను పరిశీలించి రాష్ట్ర ఉన్నత విద్యామండలికి సూచనలిస్తారు. అనంతరం ఉన్నత విద్యామండలి సీఎంకు పంపగా రాష్ట్రంలోని ఒక్కో యూనివర్సిటీకి వీసీ కోసం మూడేసి పేర్లను సూచిస్తూ ఆ ఫైల్‌ను గవర్నర్‌కు పంపగా ఆయన వీసీలను నియమిస్తారు.

ఇక రుడా వెంచర్లు

పీపీపీ విధానంలో అభివృద్ధి
అక్రమ లేఅవుట్లకు అనుమతులు ఇవ్వొద్దు
తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రుడా వెంచర్లు వేసి పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్, రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా) చైర్‌పర్సన్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రుడా నిర్వహించిన ఐదో బోర్డు సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను రుడాకు స్వాధీనం చేసే విధానంపై ఆలోచించాలన్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో అనధికార లేఅవుట్లను గుర్తించాలన్నారు. రుడా పరిధిలో దరఖాస్తుల సమయంలో యూజర్ చార్జీల కింద వసూలు చేసే మొత్తాన్ని రూ.500 నుంచి రూ.1000కు పెంచినట్టు తెలిపారు. రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధానంతో చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో రుడా సెక్రటరీ శైలజ, టూరిజం ఆర్డీ వి.స్వామినాయుడు, ఇన్‌చార్జి డీపీవో ఎం.నాగలత, ట్రాన్స్‌కో ఎస్ఈ కె.తిలక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ అండర్-14 బాలురు, బాలికలు జిల్లా జట్ల ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌లో అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్ల ఎంపికలను గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 11న శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, డీవైఈవో ఈవీవీఎస్ఎన్‌బీఎల్ నారాయణ, డీఐ బి.దిలీప్‌కుమార్, జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, కార్యదర్శి నాగరాజు, ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని వినతి

దివాన్‌చెరువు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పీజీ సెట్ రాయని అభ్యర్థులకు విశ్వవిద్యాలయంలో పీజీ చదువుకునేలా స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని ఉప కులపతి శ్రీనివాసరావుకు అనూరా అలూమ్ని (పూర్వ విద్యార్థుల సంఘం) అధ్యక్షుడు గాదె కిషోర్, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ కె.కమలకుమారి, కార్యదర్శి, స్పృహ అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర నాగేంద్రకిషోర్ వినతిపత్రం అందజేశారు. పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సుల్లో భర్తీకానీ సీట్లకు ఏపీ పీజీసెట్ రాయని అభ్యర్థులకు కూడా స్పాట్ అడ్మిషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలించి ఆ మేరకు చర్యలు తీసుకుంటామని వీసీ చెప్పారు.



గుమ్మళ్లదొడ్డిలో రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు

ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శ్రీనివాసరావు

అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం



గోల్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంటును గురువారం ఆయన గోల్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉమ్మడిగోదావరి జిల్లాల్లో నన్నయ విశ్వవిద్యాలయం తరపున 42 రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంతో ప్రతిభావంతులైన గ్రామీణ యువత వెలుగులోకి వచ్చి ఉన్నత స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పురుషుల టోర్నమెంట్-కమ్-విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలకు వివిధ కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారన్నారు. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో ప్రతిభ కనబరిచిన జట్టు వచ్చే నెల 1నుంచి 5వ తేదీ వరకు బెంగళూరులోని క్రిస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, క్రీడా బోర్డ్ ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులైన రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు రమణ, విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

అస్సాగో బ్యాక్

ఇథనాల్ పరిశ్రమను తొలగించే వరకు దీక్ష విరమించేది లేదు

ఉద్యమ ప్రతినిధులు శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి స్పష్టీకరణ

అస్సాగో కంపెనీ ముట్టడికి నిరసనకారుల యత్నం

గుమ్మళ్లదొడ్డిలో భారీ ర్యాలీ.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



ఆందోళనకారులతో చర్చిస్తున్న ఆర్డీవో కృష్ణానాయక్

గోకవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాలుష్య కారకమైన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి స్థానికులకు పూర్తి విముక్తి కలిగే వరకు దీక్ష విరమించబోమని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో ఇథనాల్ పరిశ్రమ నిర్వహణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరవధిక దీక్ష గురువారం మూడో రోజుకు చేరుకుంది. శిబిరాన్ని గుమ్మళ్ళదొడ్డి, అచ్చుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు సందర్శించి సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా పరిశ్రమ నిర్వహణను ప్రోత్సహించేలా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు.

మూడు రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి ఆరోగ్యం క్షీణిస్తోంది. రక్తప్రసరణ, షుగర్ లెవెల్స్ క్రమంగా తగ్గుతున్నాయి. ప్రభుత్వ వైద్యులు వారికి గంట గంటకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

దీక్షా శిబిరం వద్ద నుంచి కంపెనీని ముట్టడించేందుకు నిరసనకారులు భారీ ర్యాలీగా బయల్దేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున చేరుకుని ప్రధాన రహదారిపై అడ్డుకున్నారు. దీంతో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయ ఏర్పడింది. ఆ సమయంలో ఇతర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు కంపెనీ నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామంటూ నిరసనకారులకు మద్దతు తెలిపారు.

అస్సాగో పరిశ్రమను రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణానాయక్ పరిశీలించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి బాధితులతో చర్చించారు. పరిశ్రమ ఏర్పాటుతో కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేసి తద్వారా పరిష్కార మార్గం చూపుతామని బాధితులకు సూచించారు. కమిటీ ఏర్పాటును నిరసనకారులు పూర్తిగా విభేదించారు. కంపెనీని పూర్తిగా తొలగించే వరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అస్సాగో సమస్య పరిష్కారానికి కమిటీ: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమ సమస్య పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం ఆమె తన చాంబర్‌లో పరిశ్రమలు, పర్యావరణ శాఖల అధికారులతో సమీక్షించారు. కమిటీలో సమన్వయ శాఖల అధికారులు, గ్రామస్తులు, పరిశ్రమ ప్రతినిధులు ఉంటారన్నారు. ఇది పరిశ్రమలో కాలుష్య ప్రభావం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, గ్రామస్తుల అభ్యంతరాలపై అధ్యయనం చేస్తుందన్నారు. అధికార బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపడుతుందని చెప్పారు. సమావేశంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి రామన్, ఉమ్మడి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎంబీఎస్ శంకరరావు, ప్రమోనల్ అధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం గుట్టు... రట్టు

ప్రిన్సిపాల్ క్వార్టర్స్‌లో 1,700 కిలోల బియ్యం నిల్వలు

ఎంపీపీ తనిఖీలో వెలుగు చూసిన వైనం



అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి



తుప్పల్లో దాచి వుంచిన బియ్యం బస్తాలు

రాజవొమ్మంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసానికి వచ్చిన విద్యార్థినులను కార్మికులుగా మార్చడమే కాకుండా ఏకంగా దొంగలను చేసింది ఓ ప్రిన్సిపాల్. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రభుత్వ బాలికల గురుకుల కళాశాలలో వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి... ఎంపీపీ గోము వెంకటలక్ష్మి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని విద్యార్థులను ఆరా తీశారు. ఆ సమయంలో మెస్ పక్కనే ఉన్న ప్రిన్సిపాల్ క్వార్టర్‌లో ఇంగ్లీష్ లెక్చరర్ ఉంటున్నారని, అక్కడ వేల కిలోల బియ్యం అక్రమంగా నిల్వ చేసి ఉంచినట్టు ఆమె తెలుసుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులకు, పాత్రికేయులకు సమాచారం అందించారు. హుటాహుటిన కళాశాలకు వచ్చిన రెవెన్యూ అధికారులు క్వార్టర్ తాళం లేకపోవడంతో కళాశాలలో ఉండాల్సిన స్టాక్, ఉన్న స్టాక్ వివరాలను చూశారు. బియ్యం నిల్వ చేసిన క్వార్టర్ వెనుక వైపు నుంచి వచ్చిన ప్రిన్సిపాల్ బస్తాలను తుప్పల్లోకి మోయలంటూ విద్యార్థినులను ఆదేశించారు. దీంతో వారు బియ్యం బస్తాలను సుమారు 100మీటర్ల దూరంలో ఉన్న తుప్పల్లోకి తీసుకెళ్లారు. దీనిని గమనించిన ఎంపీపీ వెంకటలక్ష్మి క్వార్టర్ వెనుక వైపునకు వెళ్లడంతో నాలుగు బస్తాలను తుప్పల్లో వదిలి 8 మంది విద్యార్థినులు పరుగులు తీశారు. ప్రిన్సిపాల్ సలోని తీరుపై ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఐటీడీఏ పీవోకు, కలెక్టర్‌కు జరిగిన ఘటనను ఫోనులో నివేదించింది. వెంటనే స్పందించిన పీవో డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతిని విచారణ అధికారిగా నియమించారు. ఉదయం 11 గంటల నుంచీ బియ్యం నిల్వ చేసిన క్వార్టర్ తాళాలను ప్రిన్సిపాల్ ఇవ్వకపోవడంతో రెవెన్యూ అధికారులు ఆ గదిని సీజ్ చేశారు. సాయంత్రం డీడీ విజయశాంతి వచ్చే వరకు రెవెన్యూ సిబ్బంది, ఎంపీపీ అక్కడే నిరీక్షించారు. విజయలక్ష్మి వచ్చి మండల అధికారుల సమక్షంలో క్వార్టర్ తెరిచి దర్యాప్తు నిర్వహించారు. అనంతరం డీడీ విజయశాంతి పాత్రికేయులతో మాట్లాడుతూ... క్వార్టర్‌లో 34 బస్తాల్లో 1,700 కిలోల బియ్యం, 10 కిలోల చింతపండు నిల్వ వుంచినట్టు గుర్తించి వాటిని అడ్డతీగల ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని, దీనికి పూర్తి బాధ్యత తనదే అని ప్రిన్సిపాల్ సలోని ఒప్పుకున్నారని చెప్పారు.

దర్యాప్తులో భాగంగా కళాశాల విద్యార్థినులను డీడీ ప్రశ్నించగా స్టాక్ పాయింట్ నుంచి 34 బస్తాలను దసరా సెలవులకు ముందు తామే ప్రిన్సిపాల్ క్వార్టర్‌లోకి మోసామన్నారు. గురువారం అధికారుల తనిఖీల సమయంలో కూడా ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకే బియ్యం బస్తాలను క్వార్టర్ వెనుక నుంచి తుప్పల్లోకి తీసుకెళ్లామన్నారు. విద్యార్థినులతో బియ్యం బస్తాలు మోయించడంపై ఎంపీపీ గోము వెంకటలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీడీ విజయశాంతి మాట్లాడుతూ ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని, ప్రిన్సిపాల్‌పై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.

ఏవీ నగరంలో అర్ధరాత్రి అలజడి

- మహిళ ఇంటికి వచ్చిన యువకుడు
- ఇటీవల మహిళ భర్త మృతి
- వారిద్దరే హత్య చేశారని బంధువుల ఆరోపణ
- పోస్టుమార్టానికి సిద్ధమవుతున్న అధికారులు

తొండంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరంలో గురువారం అర్ధరాత్రి వేళ ఒక యువకుడు ఒక మహిళ ఇంటికి రావడంతో గ్రామంలో అలజడి చెలరేగింది. మహిళతో పాటు యువకుడిని గ్రామస్తులు నిలువరించారు. అర్ధరాత్రి వేళ యువకుడు రావడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆరా తీశారు. యువకుడి పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏవీ నగరం దళిత కాలనీకి చెందిన బత్తిన మధుబాబు (38) ఈ నెల 18న మృతి చెందాడు. ఆయన భార్య శిరీష, శంఖవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన పీతల ప్రశాంత్‌కుమార్ గతంలో ఒక ఆసుపత్రిలో పని చేశారు. శిరీష ఇంటికి ప్రశాంత్‌కుమార్ అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా రావడాన్ని గమనించిన స్థానికులు, బంధువులు ఈ వేళ రావాల్సిన అవసరమేముందని వారిని నిలదీశారు. అంతేగాక మధుబాబు మృతికి వారిద్దరే కారణమని బంధువులు అనుమానిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తొండంగి పోలీసులకు తెలిపి మధుబాబుది సహజ మరణం కాదన్న అనుమానం వ్యక్తం చేశారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ మధుబాబు మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పూడ్చిపెట్టిన మధుబాబు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

లారీని ఢీకొన్న వ్యాన్

తీవ్ర గాయాలతో డ్రైవర్ మృతి



మృతుడు గురునాయుడు (పాత చిత్రం)

తుని రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం చేపూరు సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. విజయవాడ నుంచి విజయనగరం కోడిగుడ్లతో వెళ్తున్న వ్యాన్ గవరయ్య కోనేరు వద్దకు చేరుకునే సమయంలో ఎదరు చక్రం పాడవ్వడంతో ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. క్యాబిన్‌లో చిక్కుకోగా తీవ్ర గాయాలతో మృతి చెందాడు. తుని రూరల్ పోలీసులుసంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు వెల్లడించారు. మృతి చెందిన డ్రైవర్ కల్యాణపు గురునాయుడు (30) విజయనగరం జిల్లా గొర్ల గ్రామానికి చెందిన వాడని, అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.

పూడ్చి పెట్టిన మృతదేహానికి శవపంచనామా



గోదావరి తీరంలో పూడ్చిపెట్టిన బాలిక మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు, అక్టోబరు 24: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడుకు చెందిన చెక్కపల్లి వెన్నెల (15) ఈ నెల 18న ఆత్మహత్యకు పాల్పడింది. గోదావరి తీరంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. ఆలమూరు తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు అధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులు, బంధువుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ నెల 18న వెన్నెల ఇంటి వద్ద ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ రోజే మడికి వద్ద గోదావరిలో పూడ్చి పెట్టారు. తన కుమార్తె చెముడులంకలోని షిర్డిసాయి విద్యానికేతన్‌లో పదో తరగతి చదువుతోందని, దసరా సెలవులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్కూలు యాజమాన్యం బెదిరించిందని, దీంతో పదో తరగతి పాస్ కాలేననే ఉద్దేశ్యంతో ఆత్మహత్యకు పాల్పడిందని వెన్నెల తండ్రి చెక్కపల్లి శ్రీనివాస్ ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్‌కు మద్దతుగా వెన్నెల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బుధవారం రాత్రి భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వెన్నెల కుటుంబానికి న్యాయం చేయాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. కాగా ఫిర్యాదు నేపథ్యంలో ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆలమూరు ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్.రాము, ఏఎస్ఐ సూర్యచంద్రరావుతో పాటు పలువురు ఇబ్బంది సమక్షంలో శవపరీక్షకు ఏర్పాట్లు చేశారు. పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తహసీల్దారు ప్రకాష్‌బాబు సమక్షంలో బయటకు తీసి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.



నిందితులతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న మోతుగూడెం ఎస్ఐ

గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్టు

మోతుగూడెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం ఎస్ఐ కె.శివనారాయణకు వచ్చిన సమాచారంతో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రంలోని పసుపుల్లంక గ్రామం నుంచి విజయవాడకు అక్రమంగా తరలిస్తున్న రూ.10వేలు విలువైన రెండు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షేక్ రిజ్వాన్, కూరగంటి సుభాష్‌లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. తనిఖీల్లో ఏఎస్ఐ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, వీసీఎస్ ఈశ్వరరావు, ఎస్ఆర్‌కే రాజు, ఏఆర్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమోన్మాదం

- వివాహితపై యువకుడి హత్యాయత్నం
- తిరుగుడుమెట్టలో ఘటన
- వివరాలు సేకరించిన తాళ్లపూడి పోలీసులు

తాళ్లపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను ఒప్పుకోలేదని ఒక ఉన్మాది వివాహితపై హత్యాయత్నానికి తెగబడ్డాడు. ఏలూరు జిల్లా దెందులూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి హరినాథ్ డిగ్రీ చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం గ్రామానికి చెందిన యువతి అమ్మమ్మ ఊరైన దెందులూరు వెళ్లింది. ఆ యువతిని చూసిన హరినాథ్ ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. అందుకు ఆమె ససేమిరా అంది. తమ బంధువుల అబ్బాయితో పెళ్లి కుదిరింది వదిలేయమని వేడుకుంది.. అయినా పట్టించుకోకుండా వెంటపడుతూనే ఉండేవాడు. ఇదిలా ఉండగా ఆరు నెలల కిందట తూర్పు గోదావరి జిల్లా తిరుగుడుమెట్టకు చెందిన బంధువుల అబ్బాయితో వివాహమైంది. అయినా ఆమెను వదల్లేదు. ఫోన్ చేసి వేధిస్తూనే ఉన్నాడు. ఆమె స్పందించకపోవడంతో ఉన్మాదిగా మారి గురువారం ఉదయం తిరుగుడుమెట్ట చేరుకున్నాడు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుందాం రమ్మని పట్టుబట్టాడు.. అయినా మాట వినలేదు.. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుండగానే తన వెంట తెచ్చుకున్న చాకుతో ఆమె పొట్ట భాగంలో పొడిచి పారిపోయాడు. గాయాలపాలైన మహిళను స్థానికులు వెంటనే కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి బాగానే ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనపై తాళ్లపూడి పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉన్మాది పరారీలో ఉన్నట్టు పోలీసులు చెప్పారు.



అత్యాచారయత్నం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ భీమరాజు, శివకృష్ణ

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు

క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

పి.గన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):: పక్షపాతంతో బాధపడుతూ కొన్నాళ్లుగా మంచంపైనే ఉన్న వృద్ధురాలిపై కనికరం లేకుండా అత్యాచార యత్నం చేశాడు ఓ ఉన్మాది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని ఒక గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఐ.పోలవరం మండలం జి.మూలపొలానికి చెందిన ఓ వృద్ధురాలు రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతోంది. నాలుగు నెలల క్రితం పి.గన్నవరం మండలంలోని కుమార్తె ఇంటికి వచ్చింది. కుమార్తె ఈ నెల 23వ తేదీన ఒక కార్యక్రమానికి వెళ్లింది. సాయంత్రం 4.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చింది. ఒక వ్యక్తి తనపై అత్యాచారయత్నం చేశాడని వృద్ధురాలు కుమార్తెకు తెలిపింది. అదే గ్రామానికి చెందిన లంకె సత్యనారాయణ ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని భావిస్తూ కుమార్తె పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు అదే రోజు రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. గురువారం సీఐ భీమరాజు క్లూస్‌టీమ్ ఎస్ఐ ప్రవీణ్‌తో పాటు సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

జగన్ ప్రచార ఆర్భాటానికే భూసర్వే

» ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
» రెవెన్యూ గ్రామసభలు


ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి తన ప్రచార ఆర్భాటం కోసమే భూముల రీసర్వే కార్యక్రమం చేపట్టారని కోట్లాది రూపాయలు ఖర్చు చేసి చివరకు రైతులను ఇబ్బంది పెట్టడం మినహా ప్రయోజనం లేదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మహేంద్రవాడలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభను, రైతులు అందించిన ఫిర్యాదులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామన్నారు. తప్పులను సరి చేసి రాజముద్రతో త్వరలోనే పాసు పుస్తకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రీసర్వేకు 53 దరఖాస్తులు..

బిక్కవోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేకు 53 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ సత్యకృష్ణ తెలిపారు. మెళ్లూరులో సర్పంచ్ పెద్దిరెడ్డి సత్యసాయిరామ్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో గ్రామానికి చెందిన 53 మంది రైతులు తమ భూముల కొలతల్లో తేడా లున్నాయని, మరలా సర్వే జరిపి భూములు తమకు అప్పగించాలని తహశీల్దార్‌ను కోరారు. సభలో కూటమి నాయకులు చినఅచ్యుతరామయ్య పెద్దిరెడ్డి బాబ్జి, గంగుమళ్ల శ్రీనివాస్, పాట్నీడి గంగరాజు, చవ్వాకుల రామ్‌దేవ్, ఆర్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.

నిజమైన లబ్ధిదారులకు పట్టాలిస్తాం

» ప్రజావాణి సమస్యలపై-పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజానగరంలో జగనన్న నివాస స్థలాలు పేరుతో గత ప్రభుత్వం చేపట్టిన నివాస స్థల పట్టాల పంపిణీలో పెద్ద స్కాం జరిగినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని, దీనిని సరిచేసి నిజమైన లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసే దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ప్రజావాణి సమస్యలపై-పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం అధికారులు, లబ్ధిదారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశుసంవర్థక శాఖకు చెందిన ప్రభుత్వ భూమిలో ఎన్నికల నేపథ్యంలో గుట్టుచప్పుడు కాకుండా హడావిడిగా పట్టాలు పంపిణీ చేశారని, ఆ స్థలంలో ఇప్పటికే గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్లు ఇప్పించాలని వేడుకుంటు న్నారని, అయితే ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందన్నారు. ఇక్కడ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలంటే రూ.85 లక్షలు ఖర్చవుతుందని, కోర్టు అడ్డంకులు తొలగిన తర్వాత నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈకాలనీలో 435 మంది లబ్ధిదారులకుగానూ 318 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్టు రికార్డుల్లో నమోదు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేపీ ఝాన్సీ, తహశీల్దార్ లక్ష్మీలావణ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి, నీలపాల అరవరాజు, నూనె వెంకన్న, తోట రామకృష్ణ, సైతిన చెల్లారావు పాల్గొన్నారు.

గైట్‌లో దంత వైద్య శిబిరం

రాజానగరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : గైట్ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత దంత వైద్య శిబిరాన్ని విద్యార్థులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ వల్లీ మాధవి కోరారు. తొలిరోజు శిబిరంలో 150 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించగా, మరో 86 మందికి ఫిల్లింగ్ నిర్వహించినట్టు చెప్పారు. దీనిలో భాగంగా రక్తదానంపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ పీవో కే.కాళీకృష్ణ, జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, హెచ్‌వోడీ రమేష్, లెక్చరర్ మౌనికారెడ్డి, క్యాంప్ కోఆర్డినేటర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ప్రణాళికలు

ఉండ్రాజవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని తహశీల్దార్ పీ ఎన్‌డీ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ధాన్యం సేకరణపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణలో రైతులకు, రైస్ మిల్లర్లకు సిబ్బంది వారధిలా పనిచేయాలన్నారు.రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి ఎప్పటికప్పుడు సమాచారం సిబ్బంది అందజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎమ్.విశ్వాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఎస్ శిక్షణ అవసరం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) శిక్షణ ఎంతో అవసరమని రాజమండ్రి అడ్వాన్స్ క్రిటికల్ కేర్(ఆర్ఏసీసీ) హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ తాటికొండ చంద్రమౌళి అన్నారు. గురువారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్ రాజమండ్రి అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన హుక్కుంపేటలో సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసి డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వ్యక్తి పాణాలను కాపాడడం, అత్యవసర పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడడానికి బీఎల్ఎస్ సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వీబీటీ రాజు, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన తోరాటి ప్రభాకరరావు, సహాయ కార్యదర్శి కె.జనార్దన్ లను సభ్యులు సత్కరించారు.

ఈలకొలనులో గణపతి హోమం

రంగంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈలకొలను గ్రామంలో శ్రీతిక్కిశెట్టి తమ్మిరాజు గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీమహా గణపతి హోమం, అయ్యప్పస్వామి లక్ష బిల్వార్చన, దివ్య పడి పూజ బుధవారం రాత్రి నిర్వహించారు. గురుస్వాములు శ్రీబాల త్రిపుర సుందరి ఆధ్యాత్మిక పీఠం రవి, కాకినాడ వేల్, వెలుగుబంధ వాడ్రేవు శ్రీనివాస్‌కుమార్, వడిశలేరు రేగడమిల్లి రామదేవ్‌శర్మ మంత్రోత్సరణలతో కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్నదానం అనంతరం అయ్యప్పస్వామి ఊరేగింపు జరిగింది. స్వామిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అళ్ల గోవిందు, నీలపాల త్రిమూర్తులు, కడిమి సాయి, ఎంపీటీసీ ఉద్దండ్రావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేటలో బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు

రంగంపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు షైలవరపు సాయిరాం ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. మండలంలో ఇంతవరకు సుమారు ఏడువేల సభ్యత్వాలు పూర్తిచేసుకొని, 50 మంది క్రియాశీలక సభ్యత్వాలు తీసుకున్నామని చెప్పారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదులో రంగంపేట ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సాయిరాం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మండవిల్లి గుప్త,తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి



సీతానగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్లలోపు పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ చైతన్య సూచించారు. ప్రపంచ పోలియో నివారణ దినం సందర్భంగా గురువారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలియో వ్యాధితో పిల్లల్లో శాశ్వత అంగవైకల్యం సంభవిస్తుందని, దానిని నివారించేందుకు ప్రతిఒక్కరు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో యర్రా సుబ్బారాయుడు, పీహెచ్‌ఎం ఆదిలక్ష్మి, కె.పావని, బి.శైలజ, డి.కీర్తి పాల్గొన్నారు.

రేవులు శుభ్రంగా ఉండాలి

» ఇంత అలసత్వం సరికాదు
» ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
» పుష్కరఘాట్ పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పుష్కరఘాట్‌లో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గోదావరి రేవులను వెంటనే శుభ్రం చేసి.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అధికారులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశించారు. రేవులు అపరిశుభ్రంగా ఉండడం.. యాత్రికులు, మాలాధారులు ఎక్కువ సంఖ్యలో స్నానమాచరించే పుష్కర ఘాట్ మరీ దారుణంగా తయారు కావడంపై 'కార్తీకం వస్తేగానీ.. రేవులను పట్టించుకోరా' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' గురువారం కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించారు. ఆకస్మికంగా పుష్కర ఘాట్‌ను పరిశీలించారు. భక్తులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. రుడా ఏర్పాటు చేసిన లాకర్లను స్వయంగా తెరిచి చూశారు. సులభ్ కాంప్లెక్స్‌లో రూ.10 వసూలు చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లాకర్లు అందుబాటులోకి తీసుకురావాలని, సులభ్ కాంప్లెక్స్ వద్ద రూ.5 మాత్రమే తీసుకోవాలని, సూచన బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ నిబంధనలను ఉల్లంఘించి ఎక్కువ ధర వసూలు చేస్తే వెంటనే ఆ వ్యక్తులపై చర్యలు తీసుకొని అవసరమైతే మార్పు చేయాలన్నారు. ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అసౌకర్యం కలగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. రేవుల్లో బ్లీచింగ్ చల్లడంతోపాటు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, రేవులన్నిటినీ పరిశీలించి ఒక యాక్షన్ ప్లాన్‌తో సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రేవుల్లో సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరుగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అభివృద్ధి పనులపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. నగరంలో రోడ్లలోని గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రారంభించవలసిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. వర్షాకాలం పూర్తయినందున బీటీ రోడ్లకు సంబంధించిన పనులకు అంచనాలు తయారు చేయాలన్నారు. రోడ్లు వేసేటప్పుడు పూర్తిగా వేయాలన్నారు. డ్రైనేజీలకు రోడ్లు కు మధ్య ఖాళీలు లేకుండా చూడాలన్నారు. డివైడర్లలో వేసిన మొక్కలు జాగ్రత్తగా సంరక్షించాలని చెప్పారు. సమీక్షలో ఎస్ఈ ఇన్‌చార్జి మదర్షాఅలీ, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీలకు హాసిని ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

అనపర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాట్‌పుట్ పోటీల్లో జిల్లా స్థాయిలో తమ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచిందని అనపర్తి జీబీఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాల హెచ్ఎం రామారావు తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎ.హాసిని అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు ఈ సందర్భంగా హాసినిని విద్యా సంస్థల కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి, గవర్నింగ్ బాడీ సభ్యుడు గొలుగూరి రామారెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు బొమ్మూరు ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో బొమ్మూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి సంస్థ అధికారి హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 3 ప్రముఖ కంపెనీలు హాజరు కానున్నాయన్నారు. వీటిలో వివిధ ఉద్యోగాల్లో పనిచేసేందుకు ఐటీఐ, డిప్లమో, బీటెక్ - ఎలక్ట్రికల్, మెకానికల్, ఏంబీఏ పూర్తి చేసి 19నుంచి 35 వయస్సున్న వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా పూర్తి వివరాలతో రిజిస్టరై జాబ్‌మేళాకు రెజ్యూమ్, సర్టిఫికెట్లు, ఆధార్, కాపీలతో రావాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు 73967 40041, 90636 48365 నెంబర్లను సంప్రదించాలని చెప్పారు.

బ్రిడ్జి పనులు చేపట్టండి

బీజేపీ నాయకులు

గోకవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని దేవిచౌక్ సెంటర్‌లో ఉన్న ఇరుకు వంతెన స్థానే కొత్త వంతెన నిర్మించాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.10.10 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామంటూ శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద గురువారం వారు విలేఖరుల సమావేశం ఏర్పాటుచేశారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన రోజుల వ్యవధిలో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వం వచ్చినా పనులు ముందుకు సాగడం లేదన్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టకం పోవడం వల్ల వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన చెందారు. కార్యక్రమంలో సత్తి వెంకటరెడ్డి, ఇనగోటి బాపన్నదొర, బత్తుల వెంకన్నబాబు, ముప్పిడి వెంకటేశ్వరరావు, అలబండ సుబ్రహ్మణ్యం, సిద్ధా శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నవంబరు 1నుంచి కెనాల్ రోడ్డు మరమ్మతులు



అనపర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అనపర్తి కెనాల్ రోడ్డుకు నవంబరు 1వ తేదీ నుంచి మరమ్మ తులు చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువా రం స్థానిక పంచాయతీ కార్యాలయంలో రోడ్లు భవనాల శాఖాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కెనాల్ రోడ్డు మరమ్మతు లకు రూ.6.33 కోట్లు మంజూరయ్యాయని, పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టరు సిద్ధంగా ఉన్నప్పటికీ వరుస తుపానులతో పనులు ప్రారంభానికి జాప్యం ఏర్పడిందన్నారు. కెనాల్ రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎంపీ పురందేశ్వరితో కలిసి ప్రయత్నాలు చేస్తున్నామని, ఇప్పటికే కేంద్రానికి రెండు ప్రతిపాదనలు పంపించామని అన్నారు. రెండేళ్లలో పనులు కార్యరూపం దాలుస్తాయని చెప్పారు.

రాజమహేంద్రికి పూర్వవైభవం తీసుకొస్తాం : ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 24: రాజమహేంద్రవరానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలను పోలీసులు పూర్తిగా నియంత్రించారన్నారు. సీసీ కేమేరాలు ఏర్పాటు చేశామన్నారు. షీ టీం పునః ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరం స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి టెండర్లు సిద్దం చేసినట్టు చెప్పారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 26న సొంత ఖర్చుతో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తాని, టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వర్తకుల సమస్యల పరిష్కారానికి కృషి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్తకుల సమస్యలు పరిష్కరించడానికి తమవంతు కృషి చేస్తామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాబోయే పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం రూపురేఖలు మార్చడంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ సహకారం అందించాలని కోరారు. గురువారం రాత్రి రాజమహేంద్రవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు కల్యాణ మండపంలో నూతన పాలకవర్గానికి అభినందన సత్కార సభ జరిగింది. ఈ సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఛాంబర్ పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ వ్యాపారులు నిజాయితీగా ఉండాలని, ప్రభుత్వానికి పన్నులు కట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడారు. ఆర్యాపురం బ్యాంకు ఛైర్మన్ చల్లా శంకరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దత్తు, గుడా మాజీ ఛైర్మన్ గన్ని కృష్ణ, ఈ సందర్భంగా ఛాంబర్ అధ్యక్షుడిగా ఎన్నికైన తవ్వా సూర్యనారాయణమూర్తి (తవ్వా రాజా), గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌లను ముఖ్యఅతిథులు సత్కరించారు. నగర వర్తక ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీ..కడియం పోలీస్‌స్టేషన్ తనిఖీ

వేమగిరి హైవేపై ఔట్‌పోస్ట్ ప్రారంభం


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

కడియం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడియం పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ తనిఖీచేశారు. ఆయనకు సీఐ ఎ.వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, రికార్డులను పరిశీలించి, కేసులపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు. మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణాను నియంత్రించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌ను పెంచాలన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్, ఇన్‌స్పెక్టర్(ఎస్‌బీ) ఎ.శ్రీనివాసరావు సిబ్బంది ఉన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి

ఆసుపత్రిని సందర్శించిన సీపీఐ,జట్లు లేబర్ యూనియన్


ఆసుపత్రి అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న తాటిపాక మధు


రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ఆరోగ్యం పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈఎస్ఐ ఆసుపత్రిలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. కార్మికులకు వైద్య సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకులు, జట్లు లేబర్ యూనియన్ నాయకులు ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించారు. ఓపీ, ఎమర్జన్సీ, ల్యాబ్ తదితర వైద్యసేవలపై అక్కడున్నవారిని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యసేవల పరిస్థితి దారుణంగా ఉందని, స్కానింగ్‌కు కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని అన్నారు. ల్యాబ్‌లో టెక్నీషియన్లు లేరని, మత్తు డాక్టర్ అందుబాటులో ఉండడంలేదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించాలని కోరారు. జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంబాబు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి సప్ప రమణ, నగర కార్యవర్గసభ్యులు కె.శ్రీనివాస్, టి.నాగేశ్వరరావు, పేపర్‌మిల్లు యూనియన్ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు, జట్లు సంఘం అధికారబాడీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి

అనపర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని తహశీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుదారులకు అనువైన స్థలాన్ని అధికారులు పరిశీలించారు.స్థానిక పంచాయతీ రామాలయం వెనుక ఉన్న ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటుకు అనువుగా ఉంటుందని అధికారులు భావించారు. స్థల పరిశీలన చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ బాణసంచా విక్రేతలు అన్ని రకాల అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎమ్‌పిడీవో రామకృష్ణారెడ్డి, ఫైర్ అధికారి జె శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ క్రియాశీలక సభ్యత్వాలు చేయించాలి

ఉండ్రాజవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు అధిక సంఖ్యలో నమోదు చేయించాలని మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం వేలివెన్నులో పార్టీ సభ్యత్వాల నమోదుపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం కావడానికి సభ్యత్వాలు తప్పనిసరి అని అన్నారు.





నకిలీ రేషన్ కార్డులు 4430

- ఉమ్మడి జిల్లాలో నకిలీలపై సర్వే
- రెండు రాష్ట్రాల్లో కార్డులపై ఆరా
- ఒక రాష్ట్రంలో తొలగింపు
- కేంద్ర గణాంకాలతో పరిశీలన

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):తెల్లరేషన్‌కార్డుల్లో నకిలీలను ఏరివేయనున్నారు.ఏపీతో పాటు వేరే రాష్ట్రంలోను రేషన్‌కార్డు పొంది అక్కడా.. ఇక్కడా కూడా లబ్ధిపొందుతున్న కొందరిపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్దఎత్తున డూప్లికేట్ రేషన్ కార్డులు ఉన్నట్టు తెలుస్తోంది. కేంద్రం గణాంకాల ఆధారంగా సర్వే చేయనున్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4430 డూప్లికేట్ తెలుపు రేషన్ కార్డులు ఉన్నట్టు నేషనల్ లెవెల్ డీ డూప్లికేట్ ఆఫ్ రేషన్‌కార్డు డేటా బేస్ ఆధారంగా గుర్తించారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిస్సా రేషన్ కార్డుల్లో సభ్యులుగా ఉన్నట్టు గుర్తించారు. వన్ నేషన్-వన్ రేషన్ కార్డు పేరిట నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా ఇది బయట పడింది.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు.డేటాను అనుసరించి రీసర్వే చేసి రెండు రాష్ట్రాల్లో కార్డులున్న వారి వివరాలను పంపాలని సూచించారు. దీనిపైఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో వీఆర్వోలు సర్వే చేయను న్నారు.

డూప్లికేట్లతో పక్కదారి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి కాకినాడ జిల్లాలో 319, కోనసీమ 324, తూర్పుగోదావరి జిల్లాలో 269, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3518 డూప్లికేట్ రేషన్ కార్డులు ఉన్నట్టు కేంద్రం పంపిన నివేదికలో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రీసర్వే చేసి ఆయా రేషన్‌కార్డుల్లో సభ్యులు ఇతర రాష్ట్రాల్లో ఉన్న రేషన్‌కార్డుల సభ్యులు ఒక్కరేనని ధ్రువీకరించిన తర్వాత రేషన్‌కార్డుల నుంచి కుటుంబ సభ్యులను తొలగిస్తారు. పేదలకు అందాల్సిన ఉచిత బియ్యం పథకం పక్కదారిన పడుతుందని పెద్ద ఎత్తున కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లడంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. ఒకే వ్యక్తిగానీ, ఒకే కుటుంబంగానీ రెండు రాష్ట్రాల్లో రేషన్ తీసుకోవడంవల్ల ప్రభుత్వానికి పెద్దఎత్తున నష్టం జరుగుతుందని గుర్తించింది.ఈ విషయమై జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి ఎంపీ ప్రసాద్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

వైద్యో నారాయణో హరి అన్నది ఒకప్పటి నానుడి.. ఎందుకంటే అప్పటిలో వైద్యుడు దేవుడిలా ఉండేవాడు.. వైద్యమూ అలాగే చేసేవాడు.. నాడి పట్టుకుని రోగం ఏంటో చెప్పేవాడు.. రోగిని చూసి వైద్యం చేసేవాడు.. మరిప్పుడో అంతా మారిపోయింది.. రోగి చెప్పింది వినాలంటే (కన్సల్టెన్సీ) రూ.500 నుంచి రూ.1000.. మరీ డిమాండ్ ఉంటే రూ.2 వేలు.. ఒకసారి చేయి పట్టుకుంటే (ఐసీయూ) రూ.10 వేలు..ఆ తరువాత టెస్ట్‌లు.. మందులు షరా మామూలే.. రోగి నుంచి ఇష్టానుసారం పిండేస్తున్నారు.. ఎమర్జెన్సీ ఆసుపత్రుల్లో అయితే మరీనూ.. లక్షల ఉంటేనే వైద్యం.. లేదంటే దైన్యమే.. ప్రైవేటు వైద్యంపై ప్రభుత్వ నియంత్రణ కొరవడడంతో రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారు.. కేవలం జ్వరం అని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళితే రూ.5 వేలు అవుతుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఇక హార్ట్ స్ట్రోక్ అని వెళ్లారా.. రోగి బంధువులు చచ్చారే...!దీంతో ఆసుపత్రికి వెళ్లాలంటనే భయపడే రోజులు వచ్చాయి..





డబ్బు..జబ్బు!

చూస్తే రూ.వెయ్యి.. పట్టుకుంటే రూ.10 వేలు

ఓ పెద్దావిడ మెట్లపై జారి పడడంతో తలకు దెబ్బ తగిలింది. ఆమెను రాజమహేంద్రవరంలోని ఓ ప్రముఖ కార్పొ'రేటు' ఆస్పత్రికి తీసుకెళితే ముందుగా రూ.5లక్షలు లాగేశారు. ఎడాపెడా టెస్టులు చేసి మెదడులో రక్తస్రావమైందని గుర్తించారు. మరో రూ.20 లక్షలు కడితే బ్రెయిన్ సర్జరీ చేసేస్తామన్నారు. డిశ్చార్జి చేస్తే చనిపోతుందని ఆ వైద్య వ్యాపారులు భయపెట్టారు. ఆ సర్జరీకి అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో బెంగళూరు నిమ్‌హాన్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఏదోలా అక్కడి నుంచి బయటపడి నిమ్‌హాన్స్‌కి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో 20 రోజుల వైద్యానికి అన్నీ కలుపుకొని రూ.2 లక్షలు మాత్రమే అయ్యింది. ఆమె క్షేమంగా ఇంటికి చేరారు.

కడుపు బిగపట్టేసిందని, త్రేన్పు రావడం లేదని ఓ పెద్దాయనను నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అంతే.. స్ట్రెచర్‌పై ఎక్కించి గదిలోకి తీసుకెళ్లి బంధువులకు ఠాగూర్ సినిమా చూపించారు. ఎండోస్కోపీ, యాంజియోగ్రామ్, స్కానింగ్.. ఇలా రకరకాల పరీక్షలు చేశారు. చివరికి సంచినిండా మందులు రాసి రూ.లక్ష బిల్లు వేశారు. తీరా ఆయనకు గ్యాస్ పెయిన్ వచ్చిందని రూ.5 ట్యాబ్లెట్ లేదా రూ.50 ఇంజక్షన్‌తో నయం అయిపోయేదని తర్వాత ఓ వైద్యుడు చెప్పడంతో పెద్దాయనతో పాటు బంధువులు అవాక్కయ్యారు. అన్నీ ఇలాంటివే కాకపోయినా నూటికి తొంభై శాతం ఇలానే జరు గుతోందనే వాదనలో వాస్తవం లేకపోలేదు.

- ప్రైవేటు ఆసుపత్రుల్లో బాదుడే
- డిమాండ్‌ను బట్టి కన్సల్టెన్సీ
- రూ.500 నుంచి ఆపైమాటే
- ఏడు రోజులే కార్డు
- మధ్యలో వెళితే మళ్లీ చార్జ్
- ఐసీయూ రూ.10 వేలు
- జ్వరం అని వెళ్లినా పరీక్షే..
- ఆసుపత్రికి వెళితే కష్టమే
- అచ్చంగా ఠాగూర్ సినిమా
- భయపడుతున్న ప్రజానీకం
- తట్టుకోలేక ఆత్మహత్యలు
- ఇష్టానుసారం రేట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'వైద్యో నారాయణో హరి' అంటే వైద్యులు సాక్షాత్తూ దైవంతో సమానం అని అర్థం. మన సమాజంలో వైద్యుడికిచ్చే గౌరవం అది.. కానీ ఇవాళ ప్రైవేటు/కార్పొరేటు ఆస్పత్రులకు వెళితే కుబేరుడు కూడా బికారి అయిపోతున్నాడు. వైద్యుల మితిమీరిన కాసుల కక్కుర్తికి రోగుల బంధువులు బలైపోతున్నారు. వైద్యం మరీ ఖరీదైపోవడంతో రోగి కుటుంబం ఆర్థికంగా కుదేలవుతోంది.ఏదేమైనా.. వైద్య రంగానికి డబ్బు జబ్బు ముదిరి..విలువలు మరీ తిగజారుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' పరిశోధనాత్మక కథనం.

చూస్తే రూ.500

చూస్తే వెయ్యి..పట్టుకుంటే 5 వేలు అనేంతగా వైద్యుల తీరు మారింది. వైద్యుల వద్దకు వెళ్లి చూపించుకోవాలంటే కన్సల్టెన్సీ కార్డు ధర తక్కువలో తక్కువంటే రూ.500 నుంచి ఆరంభం.రూ.2 వేలు ఉండే కార్డులూ ఉన్నాయి.అయితే వీటి జీవిత కాలం మాత్రం 7 నుంచి 15 రోజులే. గతంలో అయితే సుమారు నెల రోజులు ఉండేది. ఆ మధ్యలో ఎప్పుడు వెళ్లినా చూసేవారు.ఇప్పుడు మధ్యలో వెళ్లినా రూ.100 చెల్లించుకోవాలి. మందులు మాత్రం నెలకు రాసేస్తారు.అంటే నెల తర్వాత వస్తే మళ్లీ కార్డుకు డబ్బులు సమర్పించుకోవాలి. అసలు నాడి పట్టుకోకుండా రోగి లోనికి వచ్చిన సమస్య ఏమిటని అడగడం మరుక్షణం నుంచే మందులు రాసేస్తారు..ఈ కన్సల్టెన్సీ(కార్డు) ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో రోగిని పిండేస్తున్నారు. ప్రస్తుత తరం వైద్యులను చూసి ఆ తరం వైద్యులు మారిపోయారు. డబ్బే పరమావధిగా వైద్యం చేస్తున్నారు.దీంతో రోగులు.. వారి కూడా వచ్చే బంధువులు లబోదిబోమంటున్నారు.

జనం మారాలి..

జనం కూడా మారాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. తక్కువ ధరతో చేసే వైద్యం.. తక్కువ మందులు రాసే వైద్యుడు రోగికి నచ్చడం లేదు. ఆస్పత్రికి వెళ్లిన వెంటనే హడావుడి సృష్టించి ప్రిస్క్రిప్షన్ నిండా మందులు రాస్తే సంతృప్తి పడుతున్నారు. ఇదో మాయరోగంలా దాపురించింది. పారాసిటమల్ వేసుకుంటే తగ్గిపోయే జ్వరానికి వంద రకాల మందులు రాస్తే గానీ కుదుట పడడం లేదు. చిన్న పిల్లాడికి విరేచనాలు అవుతుంటే ముద్దపప్పు పెట్టండని, తిండి తినడం లేదంటే ఇష్టమైనవి వండి పెట్టాలని చెబుతుంటే తమను తింగరోళ్ల మాదిరిగా చూసే జనం కూడా ఉన్నారని ఓ వైద్యుడు వాపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అలాగే ఏ టెస్టులూ లేకుండా మందుల రాస్తే.. ఏ టెస్టులూ చేయకుండా జబ్బు నయం చేయడంపై మీకు ఎలా అవగాహన వచ్చిందని ప్రశ్నించి..అవసరం లేదన్నా ఇన్ పెషెంటుగా జాయినైపోతామని తమపైనే ఒత్తిడి చేసే రోగులూ ఉన్నారని మరో వైద్యురాలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.ఈ ఉదాహరణలు మనలో వైద్యం పట్ల రావాల్సిన మార్పును సూచిస్తు న్నాయి.

కమీషన్ వ్యాపారం..

అధిక శాతం ఆస్పత్రులు కమీషన్లతో లాభాలు గడిస్తున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీ ఆయా ఆస్పత్రుల్లో ఎన్‌రోల్ చేయించుకొని పేషెంటును రిఫర్ చేస్తే కొంత మొత్తం లేదా 40 శాతం వరకూ కమీషన్ ముట్టజెబుతున్నారు. అందుకే ఈ మధ్య నగరాల్లోని ప్రైవేటు/కార్పొరేటు ఆస్పత్రుల్లో గ్రామీణ రోగులు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇక స్కానింగ్, ఎక్స్‌రే తదితర టెస్టులకు తమ వద్దకు పంపిస్తే లేబొరేటరీలు ఆయా ఆస్పత్రులకు 50 శాతం వరకూ కమీషన్ రూపంలో ఇస్తున్నాయి. ఫలానా ల్యాబ్‌కి మాత్రమే వెళ్లాలని ఆస్పత్రుల్లో సూచించడం, వేరే దగ్గర చేయించుకొంటే తిరస్కరించడం, స్పష్టంగా ఫలితాలు రాలేదని చెప్పడం దాదాపుగా అందరికీ అనుభవమే.దీనికి ఆ కమీషన్ కక్కుర్తే కారణం. ఓ వ్యక్తి లిపిడ్ ప్రొఫైల్ పరీక్షకు ఓ ల్యాబ్‌కి వెళ్లారు. రూ.1200 అవుతుందని వాళ్లు చెప్పారు. ఆ వ్యక్తి డాక్టరు ఫోన్ చేసి వారికి ఇచ్చారు. తాను వేరే ఊరి డాక్టరునని, తనకు కమీషన్ వద్దని చెప్పడంతో రూ.600 మాత్రమే ల్యాబ్ వారు బిల్లు వేశారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. 'వైద్యో నారాయణో హరి' అనే నానుడు ఎందుకు కన్నీరు పెడుతోందో చెప్పడానికి ఈ ఉదాహరణలు మచ్చు తునకలు మాత్రమే సుమా!.. రోజూ ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతూనే ఉన్నాయి.



ఆసుపత్రికెళితే జేబు ఖాళీ..

ఇవాళ వైద్య రంగంలో కాసుల కక్కుర్తి తప్ప మానవతా దృక్పథం, నైతిక విలువలు కొరవ డడంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. రోగి వ్యాధిని డబ్బుతో తూకం వేయడం మితి మీరిపోయింది. డాక్టర్లు టార్గెట్లు రీచ్ కావడానికి అవసరం లేకపోయినా ఎక్స్‌రే, స్కానింగ్, మందులు రాసేస్తున్నారు. ఆస్పత్రులకు పట్టుకొన్న మరో జాడ్యం మందులు (మెడిసిన్). సొంతగా ఆస్పత్రుల్లోనే మెడికల్ షాపులు ఉండడంతో ప్రిస్క్రిప్షన్ నిండిపోయే వరకూ మందులు రాసేస్తున్నారు.దీని వెనుక ఆశ్చర్యపోయే మాయ దాగి ఉంది.గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటెటివ్స్‌ని నియమించుకొని వాళ్లను డాక్టరు వద్దకు పంపించి ప్రొడక్టును ప్రచారం చేసుకోవడం జరిగేది. దీనిని ఎథికల్ మార్కెటింగ్ అనే వాళ్లు.ఆ ప్రొడక్టును ఎక్కువగా రాసినందుకు తాయిలాలుగా వచ్చేవి. ఈ పద్ధతి ఇప్పటికీ ఉన్నా బాగా తగ్గింది. ఇప్పుడు కొత్త ఒరవడి వచ్చింది. హరియాణ, గుజరాత్‌లోని పలు చోట్ల మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. ఆయా కంపెనీల నుంచి పెద్ద ఎత్తున మందులు తెచ్చి విక్రయిస్తున్నారు.ఇవి వైద్యులకు చాలా తక్కువ ధరకు వస్తాయి. వీటిని ఎక్కువ ధరకు విక్రయిస్తారు.అందుకే అవసరం ఉన్నా లేకపోయినా ఎక్కువ మందులు రాస్తుంటారు. గ్యాస్ట్రిక్ లేకపోయినా గ్యాస్ ట్యాబ్లెట్ రాసేయడం ఈ మధ్య చూస్తూనే ఉన్నాం. వైరల్ ఫీవర్‌కి యాంటి బయోటిక్ రాయకూడదు.అసలు యాంటి బయోటిక్స్ తక్కువగా సూచించాలని ఆ తరం వైద్య నిపుణులు నెత్తీ నోరు బాదుకుంటున్నారు. అయినా తమ మెడికల్ షాపుల వ్యాపారం కోసం వైరల్ ఫీవర్‌కి సెఫిక్జిమో ఒఫలాక్సిన్ వంటి యాంటి బయోటిక్స్ చీటిలో నింపేస్తున్నారు. కాసుల కక్కుర్తితో రాసే మందులు వ్యాధి నయం మాట అటుంచితే కొత్త రోగా లు చుట్టు ముడుతున్నాయి. చివరికి రోగి ఒళ్లు, ఇల్లు గుల్లవుతోంది. తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడేవారెందరో..

డీఆర్వోగా సీతారామమూర్తి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా విశాఖపట్నం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న టీ.సీతారామమూర్తిని ప్రభుత్వం నియమించింది.ప్రస్తుత డీఆర్వో జి.నరసింహులును తిరుపతి డీఆర్వోగా నియమించారు.

'కౌలు రైతులకు కార్డులు'

రాజమహేంద్రవరంరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు సాగు హక్కు కార్డును అందజేస్తామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సాగుదారుల హక్కు చట్టం అమలుపై కౌలు రైతులు, భూయజమానులు,వ్యవసాయశాఖ, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. భూయజమాని పట్టాదారుల హక్కులకు భంగం కలగకుండా ప్రత్యక్ష, పరోక్ష అనుమతితో కార్డును జారీచేస్తారన్నారు. గతంలో రెవెన్యూ విభాగం ద్వారా గుర్తింపు ఇచ్చేవారని నూతనచట్టంలో వ్యవసాయ అధికారులు కౌలు కార్డులు ఇస్తారన్నారు.



డ్రైవర్లతో మాట్లాడుతున్న తహశీల్దార్

ర్యాంపుల్లో డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు

తనిఖీలో తహశీల్దార్ హెచ్చరిక

కొవ్వూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు, ఔరంగాబాద్ ఇసుక ర్యాంపుల వద్ద మామూళ్లపై విచారణ చేపట్టాలని ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. ఇసుక రవాణాపై 'అయోమయం గందరగోళం' అని 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. ఈ మేరకు గురువారం కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ విచారణ చేపట్టారు. కొవ్వూరులోని ఇసుక ర్యాంపులను తనిఖీచేశారు. అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవని లారీ డ్రైవర్లను హెచ్చరించారు. కొవ్వూరు పరిధిలో ర్యాంపుల నుంచి ప్రతిరోజు సుమారు 300 లారీలు వెళుతున్నట్టు తెలిపారు.



భూచోళ్లు.. ఎక్కడ!

- భాస్కర్‌నగర్ డొంక కదులుతోంది
- లేఅవుట్ అక్రమాలపై కలెక్టర్ ఆరా
- ఆరుగురు సభ్యులతో కమిటీ
- ఆక్రమణకు గురైన స్థలాల పరిశీలన
- భూమాఫియా కథనానికి స్పందన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

భూమాఫియాల డొంక కదులుతోంది. దశాబ్దాలుగా సాగుతున్న భాస్కర్ నగర్ భూ మాఫియాకు చెక్ పెట్టడానికి జిల్లా యంత్రాంగం కదిలింది. ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో భూచోళ్లు శీర్షికతో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పందించారు. అప్పట్లోనే రిజిస్ట్రేషన్లు ఆపేయాలని ఆదేశించారు. జిల్లా సహకార అధికారి నుంచి నివేదిక తెప్పించుకుని అధ్యయనం చేసి వివిధ విభాగాల ముఖ్య అధికారులతో సిక్స్ మెన్ కమిటీని నియమించారు. నెల రోజుల్లోఈ లేఅవుట్ సంగతి తేల్చాలనే లక్ష్యంతో యంత్రాం గం ముందుకు సాగుతోంది. రాజమహేంద్రవరం సిటీఆర్ఐ ప్రాంతం భాస్కరనగర్‌లో 1928లో ప్రభుత్వ ఉద్యోగులు కొందరు ది.రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్స్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.1967లో సొసైటీ ప్రెసిడెంట్‌గా ఉన్న సుంకర భాస్కరరావు (కోఆపరేటివ్ ఆఫీసర్) ఆధ్వర్యంలో భూస్వామి ఆలపాటి భాస్కర రామయ్య అండ్ బ్రదర్స్ నుంచి రూ.10 వేలకు సుమారు 32 ఎకరాల భూమిని సొసైటీ కోసం కొనుగోలు చేశారు. 1968లో ప్రభుత్వం మార్కెట్ విలువ (సబ్ రిజిస్టర్ వేల్యూ) ప్రకారం 32.09 ఎకరాలు సొసైటీ పేర రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ భూమి సర్వే నంబర్లు 111, 114,117, 118,119, 120, 121/1, 122/1, 135గా ఉన్నాయి. 1975లో భూమిని 254 ప్లాట్లుగా కేటాయించారు.మరో 20 క్రాస్ బిట్లు ఉన్నాయి. వీటిలో కొన్ని ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరగలేదు. మరికొన్ని భూయజమానులు ఎవరో తెలియదు.దీంతో ఖాళీ స్థలాలపై భూమాఫియా కన్నుపడింది. రూ.కోట్ల విలువైన ఇక్కడ భూములన్నీ రాజకీయనేతల అండదండలతోనే కబ్జా అయినట్టు చెబుతున్నారు.భూ యజమానులు స్థాని కంగా లేకపోవడం.. రిజిస్ట్రేషన్లు కాకపోవడం తదితర కారణాలతో ఆక్రమించుకోవడం..వేరేవారికి అమ్మే యడం ఇలా చాలా ప్లాట్లు ఇప్పటికి మూడు నాలుగు చేతులు కూడా మారాయి. ఇక్కడ గజం స్థలం రూ.35 వేల నుంచి రూ.45వేల వరకూ ఉంది. మార్కెట్ విలువ ఉంటే, మొత్తం ఒక్కో ప్లాట్ 346 గజాల కంటే ఎక్కువగా ఉంది. 420 గజాల స్థలాలు కూడా ఉన్నాయి. ఇది పెద్ద వివాదం కావడంతో గతంలో విజిలెన్స్ విచారణ జరిపి నివేదిక ఇచ్చింది. సొసైటీ సభ్యులు ఎవరూ లేకపోవడంతో సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్థాయి అధికారిని ప్రభుత్వం ఇక్కడ లిక్విడేటర్‌గా నియమించింది.కానీ పరిస్థితిలో మార్పులేదు.అన్యాక్రాంతం జరుగుతూనే ఉంది. మొత్తం 254 ప్లాట్లలో 160 సక్రమంగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.42 ప్లాట్లు అన్యాక్రాంతమైనట్టు గుర్తించారు. మిగతా 78 ప్లాట్లను పరిశీలిస్తున్నారు.



భూములపై ఆర్డీవో కృష్ణనాయక్ ఇతర అధికారుల పరిశీలన

రికార్డులు మాయం

ఈ సొసైటీ భూములకు సంబంధించిన రికార్డులను ఎవరో మాయం చేశారు. సబ్- రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్లు చివికిపోయి ఉన్నట్టు చెబుతున్నారు. అయినా సుమారు 10 ప్లాట్లకు పైగా సబ్- రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయడం గమనార్హం. ఇక్కడ భూకబ్జాదారులు, అధికారులు కుమ్మక్కయ్యే రికార్డులు మాయం చేశారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కోర్టులో ఆరు ప్లాట్లు ఒకరికే రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతంపై హియరింగ్ జరుగుతోంది. ఇటీవల సర్వే నంబర్ 121/1లోని 249,250 నంబరు ప్లాట్లకు సంబంధించి తాజాగా మరో వివాదం చెలరేగింది.

కలెక్టర్ ఆరా! కమిటీ ఏర్పాటు

'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆరా తీసి ఆరుగురు సభ్యులతో హైలెవెల్ కమిటీని నియమించారు. కమిటీలో రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్,జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీరాములు నాయుడు,జిల్లా రిజిస్ట్రార్ (ఆర్.సత్యనారాయణ), సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు, మునిసిపల్ కార్పొరేషన్ చీఫ్ ప్లానర్ కోటయ్య, అర్బన్ తహశీల్దార్ పాపారావు ఉన్నారు. హైలెవెల్ కమిటీ గురువారం వివాదాస్పద స్థలాలను పరిశీలించింది. మొత్తం సుమారు 2 గంటల పాటు ఈ ప్రాంతమంతా కలియతిరిగి, ప్రజల నుంచి వివరాలు సేకరించింది.లిక్విడేటర్ చంద్రశేఖర్ ఇక్కడ పరిస్థితిని అధికారులకు స్వయంగా వివరించారు. ఆర్డీవో కృష్ణనాయక్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు స్థలాలను పరిశీలించామన్నారు. ఇక్కడ ఎవరికి ఎన్‌వోసీలు ఇచ్చారో, ఎవరు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారో తదితర వివరాలను లిక్విడేటర్ నుంచి సేకరిస్తామని చెప్పారు. సుమారు నెల రోజుల్లో సమస్యను అధ్యయనం చేసి, ఎవరికీ చెందని, అన్యాక్రాంతమైన స్థలాలను స్వాధీనం చేసుకుంటామన్నారు.స్థానిక ప్రజలు, బాధితుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు.



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఆటలు ఓటమిని భరించే శక్తినిస్తాయి

పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆటలు ఓటమిని భరించే శక్తిని.. కష్టాన్ని ఎదుర్కొన్నే ధైర్యాన్ని ఇస్తాయని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ క్రీడలు, క్రీడల పోటీలు-2024ను క్రీడల పతాకాన్ని ఎగురవేసి ప్రారంభించారు. పోలీసుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి పోలీస్ స్పోర్ట్స్ మీట్ దోహదపడుతుందన్నారు.నిరంతరం విధి నిర్వహణలో ఉండే పోలీసు లకు క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ చూ పిన వారు రాష్ట్ర పోలీస్ మీట్‌లో పాల్గొంటారన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మీట్‌లో 7 జోన్లకు చెందిన 7 టీమ్‌లు కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, 100, 400, 800 మీటర్ల పరుగు, హైజంప్, లాంగ్ జంప్, క్రికెట్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు.

సీనరేజి, జీఎస్‌టీ రద్దుపై ఉత్తర్వులు రావాలి

రాజమహేంద్రవరం సిటీ/ కొవ్వూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు రీచ్‌ల నుంచి కనీసం వెయ్యి మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకం చేసేలా బోట్స్ మెన్ సొసైటీలకు లక్ష్యాలను నిర్దేశించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం జిల్లాస్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 118 సొసైటీలకు అనుమతులివ్వడం జరిగిందన్నారు. 17 ఓపెన్ రీచ్‌లకు డీఎల్ఎస్సీ అనుమతులు జారీ చేశామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఇసుక సీనరేజి, జీఎస్టీ రద్దుపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందని జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి జి.ఫణీంద్రరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 డీసిల్టేషన్ ర్యాంపులు అనుమతించడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలో 3, కొవ్వూరు డివిజన్‌లో 6 ర్యాంపులు నడుస్తున్నాయన్నారు. రాజమహేంద్రవరంలో ఒక ర్యాంపును విశాఖపట్నం జిల్లా వినియోగదారులకు కేటాయించామన్నారు. ఇసుక రవాణా సమయంలో టోల్ చార్జీలు వినియోగదారులు చెల్లించాలన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్సు టీము ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

'వ్యవసాయ విస్తర్ణాధికార్ల హేతుబద్ధీకరణ తగదు'

రాజమహేంద్రవరం,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విస్తర్ణాధికారుల (ఏఈవో)ను హేతుబద్ధీకరణ పేరుతో స్థాయిని తగ్గించడానికి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల చర్యలను తాము వ్యతిరేకిస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ విస్తర్ణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వే ణుమాధవరావు తెలిపారు.ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరం వచ్చిన వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందించినట్టు చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఉత్తర్వులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రేమను ఒప్పుకోలేదని.. వివాహితపై హత్యాయత్నం 7
ఇక రుడా వెంచర్లు 8

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



నల్లజర్ల–పోతవరం హైవే ఫ్లైఓవర్ కింద ఆగి ఉన్న వాహనాలు, పక్కనే ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

డేంజర్ జోన్

- రోడ్డు ప్రమాదాలకు నిలయంగా నల్లజర్ల–పోతవరం రోడ్డులోని ఫ్లైఓవర్
- రోడ్డుకు ఇరువైపులా చిరు దుకాణాల బండ్లు, ఫ్లెక్సీలు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు

నల్లజర్ల, అక్టోబరు 24: మండలంలోని నల్లజర్ల–పోతవరం రోడ్డులో ఉన్న ఫ్లైఓవర్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. హైవే పోలీసుల నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. నల్లజర్ల–పోతవరం రోడ్డులో ఉన్న ఫ్లైఓవర్ కింద రాత్రి పగలు తేడా లేకుండా భారీ వాహనాలు, రాకపోకలు సాగిస్తున్నాయి. చిరు దుకాణం బండ్లు, రోడ్డుకి ఇరువైపులు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు వాహనదారులకు ఇటు అటు వచ్చే వాహనాల కనిపించకుండా చేస్తున్నాయి. సోమవారం పగలు చీపురుగూడెం నుంచి వస్తున్న కారును అచ్చన్నపాలెం నుంచి సర్వీస్ రోడ్డులో పుల్లలపాడు వెళుతున్న నిడదవోలుకు చెందిన శివ శంకర్ ఢీకొనడంతో అతని కాలు విరిగిపోయింది. కారు నుజ్జు నుజ్జయ్యింది. అలాగే అదే ప్రాంతంలో మోటార్‌సైకిల్‌ను తప్పించబోయి కారు బోల్తా పడింది. గతంలో ఇదే ప్రాంతంలో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నా ఇప్పటివరకు వాహనాలను తీయించలేదు. హైవేకు అనుకుని ఉన్న ఫ్లెక్సీలను తొలగించలేదు. మండలంలో కొన్ని ఫ్లైఓవర్‌లు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. రాత్రి సమయంలో గస్తీ కాసే పోలీసులు నిత్యం ఫ్లైఓవర్స్ క్రింద వాహనాలు లేకుండా చూడాలని, హైవేపై ఫ్లెక్సీలు కట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

గస్తీ నిర్వహిస్తాం : శ్రీనివాస్, సీఐ



ఫ్లెక్సీలను తొలగిస్తాం. రాత్రి,పగలు గస్తీ నిర్వహించి ఫ్లైఓవర్ కింద పార్క్ చేసిన వాహనాలపై జరిమానా విధిస్తాం. అక్కడ పెట్టిన దుకాణాలను తొలగిస్తాం.

టీడీపీ క్రియాశీలక సభ్యత్వాలు చేయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు శ్రీను

ఉండ్రాజవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు అధిక సంఖ్యలో నమోదు చేయించాలని టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం వేలివెన్నులో పార్టీ సభ్యత్వాల నమోదుపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం కావాడానికి సభ్యత్వాలు తప్పనిసరిగా చేయించాలని పార్టీ శ్రేణులను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలన్నారు. వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెరవలి: టీడీపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలంతా ఉత్సాహంగా పని చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు అతికాల వెంకట రామకృష్ణమ్మ (శ్రీను) అన్నారు. పెరవలి దీపికా పంక్షన్ హాలులో సభ్యత్వ సేకరణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి సభ్యత్వ సేకరణ ప్రారంభమవుతుందని, కార్యకర్తలు ప్రతీ గ్రామంలో తామున్న చోటు నుంచి మొబైల్‌ఫోన్, వాట్సాప్, ఆన్‌లైన్‌ద్వారా సభ్యత్వాన్ని నమోదు చేయవచ్చునన్నారు. ఈ విధంగా సభ్యత్వం పొందిన వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు నమోదయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అబ్బిశెట్టి సత్తిరాజు, బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి, బర్రె దొరసాని, వీర్రాజు, ప్రమీల, మానికిరెడ్డి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి సేవకుడిలా పనిచేస్తా

మంత్రి దుర్గేష్


లబ్ధిదారులకు ఎల్‌వోసీ పత్రాలను అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి సేవకుడిలా పనిచేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న నలుగురికి 13.58 లక్షల ఎల్‌వోసీ పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తుం దన్నారు. పెండ్యాల గ్రామానికి చెందిన విప్పర్తి శ్రీనుకు రూ.1,08,600, తాడిమళ్ల గ్రామానికి చెందిన శింగులూరి విజయలక్ష్మికి రూ5,00,000, పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన గంటా నాగ వెంకట సుబ్రహ్మణ్యంకు రూ.1,50,000, పెరవలి మండలం కానూరు గ్రామానికి చెందిన వీరమల్లు రాంబాబుకు రూ.6,00,000 ఎల్‌వోసీ పత్రాలను అందజేశారు. వాటిని అందుకున్న లబ్ధిదారులు కూటమి ప్రభుత్వానికి మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రుచిత

తాళ్లపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టం 2005 పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం విధి విధానాలు, దాన్ని సక్రమంగా వినియోగించుకోవడానికి ఉండే మార్గాలపై ఏవో రుచిత తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన తాళ్లపూడి తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఏవో నిర్మల, ఎంఈవో నెహ్రూజీ, రైతులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ దేవకుమార్

రక్తదానంతో పలువురికి ప్రాణదానం

కొవ్వూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో పలువురి ప్రాణాలు కాపాడవచ్చని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబుల ఆధ్వర్యంలో పోలీసు రక్తదాన శిబిరం జరిపారు. ఈ శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ రక్తదాన శిబిరం ఏర్పాటుచేశామన్నారు. రక్తదానంపై యువత అపోహలను విడనాడాలన్నారు. రక్తదానం చేసిన దాతలకు డీఎస్పీ పండ్లు, పళ్లరసాలు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ కె.సాయికిరణ్, పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు, కొవ్వూరు పట్టణ, రూరల్ ఎస్ఐలు కె.జగన్మోహనరావు, కె.శ్రీహరి, గోపాలపురం ఎస్ఐ కె.సురేష్ కుమార్, హెచ్‌సీలు జె.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, సిబ్బంది డి.రమణ, రామకృష్ణ తదితరులతో పాటు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి కేంద్రం సిబ్బంది కె.ఏ నీలిమ, జి.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతో ఉన్నతస్థానాలకు చేరుకోవాలి

'నన్నయ' వీసీ శ్రీనివాసరావు.. అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నీ


పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను ఆయన గోల్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నన్నయ వర్శిటీ తరపున 42 రకాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో ప్రతిభావంతులైన గ్రామీణ యువత వెలుగులోకి వచ్చి ఉన్నతస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారని అన్నారు. రెండురోజుల పాటు యూనివర్శిటీలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాల ల బాస్కెట్‌బాల్ పురుషుల టోర్నమెంట్‌కు కమ్ విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలకు వివిధ కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారన్నారు. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతుల్లో పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. దీనిలో ప్రతిభ చూపిన జట్టు వచ్చే నెల 1నుంచి 5 వరకూ బెంగుళూరు క్రైస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, క్రీడా బోర్డ్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంపీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులు రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకులు రమణ, వర్శిటీ వ్యాయామవిద్య విభాగ అధ్యాపకులు, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఇక రుడా వెంచర్లు

పీపీపీ విధానంలో అభివృద్ధి

అక్రమ లేఅవుట్లకు అనుమతులు ఇవ్వొద్దు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రుడా వెంచర్లు వేసి పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్, రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా) చైర్‌పర్సన్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రుడా నిర్వహించిన ఐదో బోర్డు సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను రుడాకు స్వాధీనం చేసే విధానంపై ఆలోచించాలన్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో అనధికార లేఅవుట్లను గుర్తించాలన్నారు. రుడా పరిధిలో దరఖాస్తుల సమయంలో యూజర్ చార్జీల కింద వసూలు చేసే మొత్తాన్ని రూ.500 నుంచి రూ.1000కు పెంచినట్టు తెలిపారు. రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధానంతో చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో రుడా సెక్రటరీ శైలజ, టూరిజం ఆర్డీ వి.స్వామినాయుడు, ఇన్‌చార్జి డీజీవో ఎం.నాగలత, ట్రాన్స్‌కో ఎస్ఈ కె.తిలక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఎస్ శిక్షణ అవసరం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) శిక్షణ ఎంతో అవసరమని రాజమండ్రి అడ్వాన్స్ క్రిటికల్ కేర్(ఆర్ఏసీసీ) హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ తాటికొండ చంద్రమౌళి అన్నారు. గురువారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్ రాజమండ్రి అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షతన హుక్కుంపేటలో సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసి డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడడానికి బీఎల్ఎస్ సహకరిస్తుందన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్‌కు అంతరాయం


కొవ్వూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33/11 కెవి విదుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కెవి జూనియర్ కాలేజ్ ఫీడర్‌పై విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిడదవోలు డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. పట్టణంలోని జూనియర్ కాలేజ్ రోడ్డు, మూడు డాబాల వీధి, ఐసీఐసీఐ బ్యాంకు వీధుల్లో విద్యుత్ సరఫరాలో అంత రాయానికి ప్రజలు సహకరించాలన్నారు. మధ్యాహ్నం 1 గంట తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ఎలక్ట్రికల్ పట్టణ ఏఈ డి.జగదీశ్వరరావు తెలిపారు.

నల్లజర్లలో: నల్లజర్ల మండలం పోతినీడుపాలెం, చాదరాశికుంట గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపివేస్తున్నట్టు ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. చెట్ల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

వైసీపీ పట్టణాధ్యక్ష పదవికి కృపానందం రాజీనామా

నిడదవోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ శాసన సభ్యుడు జి.శ్రీనివాస్ నాయుడు వ్యవహారశైలి వల్ల పార్టీ అధ్యక్ష పదవికి పార్టీకి రాజీనామా చేసినట్టు ముంగండ కృపానందం గురువారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయానికి రాజీనామా లేఖలు పంపినట్టు ఆయన తెలిపారు.

గ్రామ దేవతకు విరాళం


ఆర్థికసాయం అందిస్తున్న తేజ అగ్రి ఏజెన్సీస్ సంస్థ సభ్యులు

నల్లజర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల గ్రామ దేవత సోమాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తేజ అగ్రి ఏజెన్సీస్ అధినేత శీరంశెట్టి ప్రసన్నకుమార్, శ్యామల దంపతులు లక్ష1116వేలను అయ్యప్ప గురుస్వామి గుంటముక్కల రామకృష్ణకు అప్పగించారు. ఆలయంలో అయ్యప్పస్వామి పీఠం స్వాములు బొమ్మిరెడ్డి గాంధీ ఆధ్వర్యంలో మరో రూ.25వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో బలుసు శ్రీనివాసరావు, గన్నిన నాగేశ్వరరావు, గన్నిన శ్రీనివాసరావు, సవలం రామకృష్ణ పాల్గొన్నారు.


దొండపూడిలో దీపావళి దుకాణాల స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ విద్యాపతి

దీపావళి దుకాణం స్థలం పరిశీలన

గోపాలపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దీపావళి దుకాణాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి షాపులు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి సూచించారు. మండలంలోని దొండపూడి గ్రామంలో గురువారం బాణసంచా దుకాణాలను ఆయన పరిశీలించారు. దుకాణ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. బాణసంచా దుకాణాలకు లైసెన్సు తప్పనిసరి అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వీఆర్వో ఊహో, గోతియ్య, టీడీపీ నాయకులు ముత్యాల ముత్యాలరాయుడు, సీనియర్ అసిస్టెంట్ రాజు, తదితరులు ఉన్నారు.

డ్రోన్ సమ్మిట్‌లో చిన్నారి సందడి


డ్రోన్ సమ్మిట్‌లో పాల్గొన్న జస్మిత

కొవ్వూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కుమారదేవం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కనిగంటి సాంబయ్య మనుమరాలు చిన్నారి జస్మిత విజయవాడలో 21న జరిగిన డ్రోన్ సమ్మిట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి వీక్షించారు. చిన్నారులతో డ్రోన్ సమ్మిట్‌లో దిగిన ఫొటోను చంద్రబాబు తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య అమరావతికి ఐకానిక్ ట్రేడ్ తీసుకువచ్చేందుకు, టెక్నాలజీని మరింత సరళం చేసేందుకు సీఎం చంద్రబాబు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. తన మనుమరాలు డ్రోన్ సమ్మిట్‌లో పాల్గొనడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

తాళ్లపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలంతా పారిశ్రామికవేత్తలుగా ఎదగడాకికి ప్రభుత్వం పీఎంఈపిజీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తోందని జిల్లా లఘు పరిశ్రమల అభివృద్ధి, బ్యాంక్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. తాళ్లపూడి డీఆర్‌డీఏ సెర్ప్ కార్యాలయంలో గురువారం ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో మహిళలకు రుణ సౌకర్యం కల్పించే కార్యక్రమంపై వీవోలు, సీసీలకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లఘు పరిశ్రమల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లోని సంఘాల్లోని మహిళలకు అవగాహన కల్పించాలని సూచిం చారు. కార్యక్రమంలో పలు గ్రామాల ఐకేపి సిబ్బంది, స్టేట్ బ్యాంక్ మేనేజరు వెంకటయ్య, ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, డిపిఎం హేమంత్ తదతరులు పాల్గొన్నారు.



వీవోలకు, సీసీలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ ప్రోగ్రామింగ్ అధికారి శ్రీనివాస్

గ్రామ స్వరాజ్యమే ధ్యేయం : మద్దిపాటి


దేవరపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మద్దిపాటి

దేవర పల్లి, అక్టోబరు 24: గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా గ్రామాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ, శిలాఫలకాలు గురువారం ఆవిష్కరించారు. ముందుగా దేవరపల్లిలో బాలదుర్గమ్మ ఆలయంలో టీడీపీ నాయకులు ఉప్పులూరి రాంబాబు, పిన్నమనేని నవీన్, నందిగాం శ్రీధర్, అనపర్తి వాసు, ఎమ్మెల్యేగా మద్దిపాటి గెలుపొందితే బాలదుర్గమ్మ ఆలయంలో పటికబెల్లంతో తులాభారం నిర్వహిస్తామని మొక్కుకున్నారు. ఆ మొక్కుబడి తీర్చారు. మండలంలో రూ.3.50 కోట్లతో దేవరపల్లి, రామన్నపాలెం, ధూమంతన గూడెం, కృష్ణంపాలెం, లక్ష్మీపురం, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లకు భూమిపూజ నిర్వహించి శిలాఫల కాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.25 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పల్లెల్లో పండుగ కార్యక్రమంలో భాగంగా 85పంచాయతీల్లో అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో జనసేన ఇన్‌ఛార్జి సువర్ణరాజు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జడ్పీటీసీ స్వర్ణలత, ఆండ్రూ అనీల్, గన్నమని హరికృష్ణ, కొయ్యలమూడి చినబాబు, గద్దే సుబ్రహ్మణ్యం, ఉప్పులూరి రాంబాబు, కొఠారు ధృవకాంత్, పరిమి శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కానూరు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఫీడర్ మరమ్మతులు, లైన్ల ఏర్పాటు, చెట్లు కొమ్మల కత్తిరింపు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. మండలంలోని నడిపల్లి, ఉసులుమర్రు గ్రామాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు. లో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. దీని వల్ల వ్యవసాయ విద్యుత్‌లో ఉదయం 4గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పెరవలి, ఖండవల్లి, మల్లేశ్వరం, కాపవరం, కడింపాడు, పిట్లవేమవరం, అన్నవరప్పాడు, నల్లాకులవారిపాలెంలో ఉదయం 7నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇక్కడ వ్యవసాయ విద్యుత్‌ను ఉదయం 4 నుంచి 7 గంటల వరకు మధ్యాహ్నం 1నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇవ్వనున్నట్టు ఈఈ చప్పారు.

దేవరపల్లి: దేవరపల్లి టౌన్, ఇండస్ట్రియల్ ఏరియా, బంధపురం, అచ్చయ్యపాలెం గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ చెప్పారు.

ఉండ్రాజవరం: మండలంలోని చివటం గ్రామంలో ఉదయం 9గంటల నుంచి సాయత్రం4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎస్ నారాయణ అప్పారావు తెలిపారు.

ధాన్యం సేకరణకు ముందుస్తు ప్రణాళికలు


ఉండ్రాజవరంలో నిర్వహిస్తున్న సదస్సు దృశ్యం

ఉండ్రాజవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు ముందుస్త ప్రణాళికలు సిద్ధం చేయాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ధాన్యం సేకరణపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణలో రైతులకు, రైస్ మిల్లర్లకు సిబ్బంది వారధిలా పనిచేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి ఎప్పటికప్పుడు సమాచారం సిబ్బంది అందజేయాలన్నారు. వ్యవసాయాధికారి ఎమ్.విశ్వాసరావు మాట్లాడుతూ గోనె సంచులు, బరకాలు వంటి వాటితోపాటు వర్షాలు పడితే జట్టుకూలీలను అదనంగా నియమించుకోవాలని చెప్పారు. నవంబరు 1 తేదీ నుంచి ధాన్యం సేకరణ మండలంలో ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీ వో వీఎస్ రామారావు, సీఎస్ టీడీ సుధీర్‌రెడ్డి, వీఆర్వోలు, సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు ప్రజావేదిక

గోపాలపురం, అక్టోబరు 24: మండల పరిషత్ కార్యాలయంలో 26న సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏపీవో రమణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, శాసనసభ్యుడు మద్దిపాటి వెంకట్రాజు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారని అన్నారు.

విద్యార్థులకు పౌష్టిహారం పంపిణీ


ఐక్యరాజ్య సమితి దినోత్సవం నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కొవ్వూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతికి ఐక్యరాజ్య సమితి కృషి చేస్తుందని కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి వీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం కొవ్వూరు పట్టణం క్రిస్టియన్ పేటలోని మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలలో ఐక్యరాజ్య సమితి (యుఎన్ఓ డే) దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిపాటి సత్యనారాయణ, పెనుమాక జయరాజుల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.డి హుస్సేన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల అభ్యంతరాలను పరిష్కరిస్తాం

నిడదవోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రీ సర్వే జరిగిన గ్రామాలలో తలెత్తిన అభ్యంతరాలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహశీల్దార్ బి.నాగరాజు నాయక్ అన్నారు. గురువారం విజ్జేశ్వరం గ్రామంలో గ్రామసభలో తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ మాట్లాడుతూ ఐదు దరఖాస్తులు స్వీకరించగా ఇప్పటి వరకు 52 దరఖాస్తులు స్వీకరించామని ఆయన తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: వేట్టయన్
వై.స్క్రీన్2	: విశ్వం
దేవిశ్రీ(గాయత్రి	: మార్టిన్
అనన్య	: దేవర
నిడదవోలు	
వీ మ్యాక్స్	: దేవర
రాధాకృష్ణ	: వేట్టయన్
శ్రీగణపతి	: విశ్వం
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర